

కొమరపాలెంలో ప్రమాద దృశ్యం



బాణసంచా చీకట్లు

బలికోరుతున్న బాణసంచా
ఏటా ఉభయ గోదావరి జిల్లాల్లో వరుస ప్రమాదాలు
కోనసీమ జిల్లాలో బుధవారం ఘోరం.. ఏడుగురి మృతి
పాఠాలు నేర్వని వ్యాపారులు
చోద్యం చూస్తున్న అధికారులు

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): దీపావళి మందుగుండు సామగ్రి తయారీ కేంద్రాల్లోను, వ్యాపార దుకాణాల్లో ప్రతి ఏటా ఎక్కడో చోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఎక్కువగా తయారీ కేంద్రాల్లో కూలీలే ప్రమాదాలకు బలవుతున్నారు. బుధవారం అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొమరిపాలెం బాణసంచా దుకాణంలో భారీ అగ్ని ప్రమాదం సంభవించగా ఏడుగురు సజీవ దహనం అయ్యారు. ఈ ఘటనతో ఉభయగోదావరి జిల్లాల ప్రజలు ఉలిక్కిపడ్డారు. కొందరి స్వార్థంతో కొన్ని కుటుంబాల్లో చీకట్లు అలముకుంటున్నాయి. అమాయకులు బలవుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా, అజాగ్రత్తగా బాణాసంచా తయారీ నిల్వలు చేస్తుండటంతో ప్రతి ఏటా దుర్ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. దీపావళి పండుగ కోసం బాణసంచా తయారీ కేంద్రాలకు పశ్చిమగోదావరి జిల్లాలో ఇప్పటికీ లైసెన్స్‌లు ఇవ్వలేదు. దీంతో అనధికార తయారీ కేంద్రాలు నిర్వహిస్తున్నారు.



తాడేపల్లిగూడెంలో వ్యాపార సముదాయాల మధ్య మెయిన్ రోడ్డుకు చేర్చి బాణసంచా విక్రయ కేంద్రం

జిల్లాలో 50 విక్రయ కేంద్రాలు

పశ్చిమగోదావరి జిల్లాలో అధికారికంగా 50 దీపావళి బాణసంచా దుకాణాలకు ప్రభుత్వం అనుమతులు ఉన్నాయి. వాటిలో ఎక్కువగా తణుకు, తాడేపల్లిగూడెం, భీమవరం, నరసాపురం, పాలకొల్లు ప్రాంతాల్లో ఉన్నాయి. తణుకు, తాడేపల్లిగూడెం, భీమవరం ప్రాంతాల్లో విక్రయ కేంద్రాలు లైసెన్స్‌లు ఉన్నవాటికంటే అనధికారికంగా నిర్వహించే కేంద్రాలే ఎక్కువ. ఇది అధికారుల కనుసన్నల్లోనే నడుస్తున్నా యనే ఆరోపణలు ఉన్నాయి. తాడేపల్లిగూడెంలో అధికారికంగా ఐదు విక్రయ కేంద్రాలు ఉండగా అనధికారికంగా నిర్వహించే వాటితో కలిపి 12 దుకాణాలు ఉన్నాయి.

అనధికార తయారీ కేంద్రాలు

జిల్లాలో ప్రతి ఏటా బాణసంచా తయారీ కేంద్రాల్లో జరుగుతున్న ప్రమాదాల దృష్ట్యా తయారీ కేంద్రాలను జిల్లా కలెక్టర్ నాగరాణి గతేడాది నిలుపుదల చేశారు. ఈ ఏడాది కూడా అదే ఒరవడిని కొనసాగించారు. అయితే అనధికారిక తయారీ కేంద్రాల్లో మాత్రం బాణసంచా తయారు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కృష్ణా, గుంటూరు జిల్లాలతో పాటు హైదరాబాద్‌కు మన ప్రాంతాల నుంచే బాణసంచా సామగ్రి రవాణా చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. దీనిపై అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఇదిలా ఉంటే జిల్లాలు విడిపోయిన తరువాత సరిహద్దు ప్రాంతాల్లోని తోటల్లో తయారీదారులు బాణసంచా తయారు చేయిస్తున్నారనే విమర్శలున్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు

జనసంచారానికి దూరంగా విక్రయ కేంద్రాలు ఉండాలి. అయితే విక్రయ కేంద్రాలు స్కూల్స్, మెయిన్ రోడ్డు, ఇతర వ్యాపార కూడళ్ల నడుమ నిర్వహించేందుకు అధికారులు అనుమతులిస్తున్నారు. ఏ మాత్రం ప్రమాదం జరిగినా వాహన చోదకులకు, విద్యార్థులకు తీవ్ర ప్రమాదమనే సంగతి మరిపోతున్నారు. గంధకం వాడకం ఎక్కువగా ఉండటం, భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్ల పేలుడు ఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయి. అధికారులు, కర్మాగారాల యజమానుల నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి.

కూలీలకేదీ భద్రత..?

బాణసంచా తయారీ కేంద్రాల్లో పనిచేసే కార్మికులకు భద్రతా చర్యలు చేపట్టకపోవడంతో చిన్నపాటి ప్రమాదాలు సంభవించినా ప్రాణనష్టం తప్పడం లేదు. కూలీలకు కనీసం బీమా సౌకర్యం కూడా కల్పించకపోవడంతో వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి.

గత విషాదాలు..

- బాణసంచా తయారీ కేంద్రాలు, దుకాణాల్లో ప్రమాదాలు కొన్ని కుటుంబాల్లో చీకట్లు నింపుతున్నాయి. జరిగిపోయిన ప్రమాదాలను తలచుకుంటే ఇప్పటికీ భయాందోళన కలిగిస్తాయి. ఉంగుటూరు మండలం వెల్లమిల్లిలో 2009లో భారీగా పేలుడు సంభవించిందిఈ ప్రమాదంలో 8 మంది మృతి చెందగా పదుల సంఖ్యలో క్షతగాత్రులయ్యారు. అదే విధంగా తాడేపల్లిగూడెం బాణాసంచా తయారీ కేంద్రంలో ఒక వ్యక్తి మృతి చెందారు.
- 2022లో కడియద్దలో బాణాసంచా తయారీ కేంద్రం వద్ద ముగ్గురు కూలీలు సజీవ దహనం అయ్యారు. వారి అవయవాలు కూడా దొరకని పరిస్థితి.
- ఇదే ఏడాది తణుకు మండలం దువ్వలో చిచ్చుబుడ్ల రాపిడితో సంభవించిన ప్రమాదం వల్ల ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెదారు.
- 2024లో ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెంలో బాణసంచా తయారీ కేంద్రంలో పిడుగుపడి నలుగురు మృతి చెందారు.

శ్రీ మహావిష్ణువుగా చినవెంకన్న



శ్రీవారి ఆశ్వయుజమాస బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీవైకుంఠ నారాయణుడుగా చినవెంకన్న భక్తులకు దర్శనమిచ్చారు. శంఖు, చక్ర గదా ధారియై ఉభయ దేవేరులతో విశేష పుష్ప అలంకారాల్లో ఉన్న స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించు కున్నారు. తొళక్కవాహనంపై జరిగిన తిరువీధిసేవ చూపరులకు నేత్రపర్వమైంది.
- ద్వారకాతిరుమల

రహదారులకు మోక్షం



జిల్లాకు రూ.46.45 కోట్లు కేటాయింపు
పరిపాలన అనుమతులు మంజూరు
టెండర్లు పిలవనున్న ఆర్‌అండ్‌బీ శాఖ
మరి పెండింగ్ పనుల మాటేంటి ?
బకాయిలు విడుదల చేస్తేనే పనులు చేస్తామన్న కాంట్రాక్టర్లు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రహదారులపై దృష్టి పెట్టింది. జిల్లాలో రాష్ట్ర, జిల్లా రహదారుల అభివృద్ధికి పెద్ద మొత్తంలో నిధులు వెచ్చిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా రూ.1000 కోట్లు మంజూరుచేయగా ఇందులో జిల్లాకు సుమారు రూ.46.45 కోట్లు కేటాయించింది. ఈ మేరకు పరిపాలనాపరమైన అనుమతులు మంజూరుచేసింది. వీటితో 12 ప్రధాన రహదారులు అభివృద్ధి చేయనున్నారు. వీటి కోసమే ఆయా ప్రాంతాల ప్రజలు, కూటమి నేతలు ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్నారు. ప్రతి ఎమ్మెల్యే తమ పరిధిలో రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లోను వీటిపై ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నిధులు కేటాయించింది. భీమవరం, పాలకొల్లు, ఆచంట, ఉండి, తణుకు నియోజకవర్గాల పరిధిలో రోడ్లు వేయనున్నారు.

రాష్ట్ర రహదారులు	రూ.నిధులు కోట్లలో
మార్టేరు - కోడేరు	4.00 కోట్లు
పాలకొల్లు- పూలపల్లి	3.00 కోట్లు
తణుకు-భీమవరం	2.00 కోట్లు
కాళీపట్నం-భీమవరం	5.00 కోట్లు
జిల్లా రహదారులు	
పాలకొల్లు-తిల్లపూడిపాలెం	4.30 కోట్లు
ఎస్.చిక్కాల-తిల్లపూడిపాలెం	5.90 కోట్లు
అత్తిలి -అలంపురం	4.80 కోట్లు
కొల్లేరు-భీమవరం, కవిటం, మల్లివానితిప్ప	4.85 కోట్లు
అర్ధవరం-పాందువ్వ	2.50 కోట్లు
విజయవాడ-విశాఖ సర్వీస్ రోడ్	4.90 కోట్లు
మెట్రేవు-పేరుపాలెం బీచ్ రోడ్	2.20 కోట్లు
భీమవరం-ఎల్‌వీఎన్‌పురం	3.00 కోట్లు

మరి వీటి మాటేంటి ?

పై ప్రాంతాల్లో రోడ్లకు నిధులు కేటాయించారు. బాగానే వున్నప్పటికి వాస్తవానికి ఇదే వరకే టెండర్‌లు పూర్తయిన రూ.30 కోట్ల మేర పనులు పెండింగ్‌లో వున్నాయి. వాటిని చేపట్టేందుకు కాంట్రాక్టర్లు నిరాకరిస్తున్నారు. ఇందుకు ప్రధాన కార ణం వారికి ప్రభుత్వం నుంచి రూ.25 కోట్ల మేర బిల్లులు రావాలి. అవి వస్తే తప్ప పనులు చేపట్టేందుకు అంగీకరిం చడం లేదు. తాడేపల్లిగూడెం లో ముత్యాలంబపురం నుంచి ప్రత్తిపాడు వరకు రూ.7 కోట్లతో చేపట్టే పనులకు టెండర్లు ఖరారు చేసినా పనులు మొదలుకాలేదు. లోసరి నుంచి భీమవరం మీదుగా పిప్పర వరకు తాడేపల్లి గూడెం రహదారి అభివృద్ధికి కేంద్రం రూ.100 కోట్లు కేటాయించింది. రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు ఇస్తేనే టెండర్‌లు పిలవనున్నారు. వైసీపీ హయాంలో చేపట్టిన పనులకు ఇంకా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. అప్పట్లో చేపట్టిన పనులు పూర్తి కాలేదు. దాంతో లోసరి-భీమవరం-తాడేపల్లి గూడెం రహదారికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వడం లేదు. దీనికోసం కూటమి నేతలు ఎదురు చూస్తున్నారు. భీమవరం నుంచి యండగండి వరకు వేసిన రహదారి మళ్లీ దెబ్బతిం టోంది. యండగండి నుంచి కేశవరం వరకు వేసిన రహదారి మర మ్మతులకు వచ్చేస్తోంది. ఈ పరిస్థితుల్లో కేంద్రం కేటాయించిన రూ.100 కోట్లతోనే నాణ్యమైన రహదారి వేయడానికి అవకాశం ఉంటుంది. బకాయిలు ఉండడంతో రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు ఇవ్వడం లేదు.

ఆ.. సూళ్లు మూత పడాల్సిందేనా !?

భీమవరం రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కనీస సంఖ్యలో విద్యార్థులు లేని ఎయిడెడ్ పాఠశాలల మూసివేతకు ప్రభుత్వం సమాయత్తమైంది. 40 మంది విద్యార్థులు కూడా లేని ఎయిడెడ్ పాఠశాలలను గుర్తించి వాటికి నోటీసులు జారీ చేయాలని జిల్లా విద్యాశాఖకు సూచనలు ఇచ్చింది. దీనిపై జిల్లా విద్యాశాఖ ఒక మండల విద్యాశాఖాధికారి, ఇద్దరు ప్రధానోపాధ్యాయులతో కమిటీని నియమించింది. వీరు 40 మంది కూడా లేని ఎయి డెడ్ పాఠశాలలకు వెళ్లి అక్కడ ఉన్న పాఠశాల బోధన సౌకర్యాలు, ఎక్విప్‌మెంట్‌ను పరిశీలిస్తారు. దానిని బట్టి ఆ పాఠశాలకు నోటీసులు జారీ చేస్తారు. జిల్లాలో 29 ఎయిడెడ్ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 12 పాఠశాలల్లో 40 కన్నా తక్కువ విద్యార్థులు ఉన్నారు. అగర్తపాలెం, పెంటపాడుల్లో రెండు ఎయిడెడ్ హైస్కూల్స్ ఉన్నాయి. ఆకివీడు, కాళ్ళ, ఉండి మండలాల్లో 9 ప్రైమరీ ఎయిడెడ్ పాఠశాలలు ఉన్నాయి. ఒకచోట యూపీ ఎయిడెడ్ పాఠశాల ఉంది. ఇవన్నీ వచ్చే విద్యా సంవత్సరం కల్లా విద్యార్థుల సంఖ్య పెంచుకుంటూ మూతపడకుండా ముందుకు సాగుతాయి. లేకుంటే మూసివేయాల్సి ఉంటుంది.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

పీఎం మత్స్య సంపద పథకానికి 110 దరఖాస్తులు

కమిటీ సభ్యులతో కలెక్టర్ సమీక్ష

భీమవరం టౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి):పీఎం మత్స్య సంపద యోజన పథకానికి విరివిగా దరఖాస్తు చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో పీఎంఎంఎస్‌వై పథకం అమలుపై జిల్లా స్థాయి సమావేశాన్ని సంబంధిత కమిటీ సభ్యులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ పథకం ద్వారా వివిధ సబ్సిడీ రుణాలను పొంది లబ్ధిదారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. రుణం పొందేందుకు జనరల్ కేటగిరీ అయితే 50 శాతం బ్యాంకు రుణం, 40 శాతం సబ్సిడీ, 10 శాతం లబ్ధిదారుడు వాటాగా చెల్లించాల్సి ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ అయితే 30 శాతం బ్యాంకు రుణం, 60 శాతం సబ్సిడీ, 10 లబ్ధిదారుల వాటాగా చెల్లించాలి. బుధవారం నిర్వహించిన సమావేశంలో 12 పథకాలకు సంబంధించి 110 దరఖాస్తులు అందగా పది పథకాలకు సంబంధించి 100 దరఖాస్తులను ఆమోదించినట్టు తెలి పారు. సమావేశంలో రాష్ట్ర మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్, అప్సడా జిల్లా నోడల్ అధికారి పి.సురేష్, జిల్లా మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు ఏ.నాగరాజు, డీఆర్‌డీఏ పీడీ వేణుగోపాల్, ఆక్వా రైతుల ప్రతినిధి వాతాడి కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా చెరువులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి : కలెక్టర్

జిల్లాలో ఆక్వా చెరువులకు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయం నుంచి ఒక ప్రకటనలో ఈ విషయం తెలియపరిచారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆక్వా డెవలప్‌మెంట్ అథారిటీ సైట్‌లో రైతులు రిజిస్ట్రేషన్ చేసుకుంటేనే ప్రభుత్వం ఇచ్చే రాయితీలు వర్తిస్తాయని స్పష్టం చేశారు. ఇప్పటిదాకా 50 వేల ఎకరాలకు మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మరో 85 వేల ఎకరాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కలెక్టర్ తేల్చిచెప్పారు. ఇప్పటికే గడువు ఇచ్చి 20 రోజులు ముగిసిందని రైతులు ముందుకు రావాలని కోరారు.



పాలకొల్లులో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మంత్రి రామానాయుడు

టిడ్కో ఇళ్ల లబ్ధిదారులను రుణగ్రస్తులను చేసింది జగనే

పాలకొల్లులో అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి నిమ్మల

పాలకొల్లు టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి):టిడ్కో ఇళ్ల లబ్ధిదారులను రుణగ్రస్తులను చేసి జగన్ మోసం చేశారని, టీడీపీ ప్రభుత్వ హయాంలో 90 శాతం పూర్తయిన టిడ్కో గృహాలను బ్యాంకులో తాకట్టు పెట్టి ఐదు వేల కోట్ల రూపాయలను మళ్లించారని రాష్ట్ర జల వనరులశాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లులో కోట్లాది రూపాయలతో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను మంత్రి కూటమి నాయకులు, అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనం, గౌడ, శెట్టిబలిజ భవనం, ముస్లిం షాదీఖానా, టిడ్కో గృహాలు, కాలువపై బ్రిడ్జి, ప్రభుత్వ ఆసుపత్రి భవనం, పార్కులు, ఎన్టీఆర్ కళాక్షేత్రంలో జరుగుతున్న పనుల పురోగతిని మంత్రి పరిశీలించారు. టిడ్కో గృహాల పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, పూర్తవగానే మిగిలిన లబ్ధిదారులకు ఇళ్లను అప్పగిస్తామని చెప్పారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అంబేడ్కర్ భవనం, గౌడ, శెట్టిబలిజ భవనం, ముస్లిం షాదీఖానా అభివృద్ధి పనులవైపు గత వైసీపీ ప్రభుత్వంలో పాలకులు కన్నెత్తి చూడలేదన్నారు. పట్టణంలో అభివృద్ధి పనులన్నింటినీ పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, ఆర్డీవో దాసి రాజు, మున్సిపల్ కమిషనర్ విజయసారధి, ఎన్డీఏ కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



కాళ్ళ మండలం పెద అమిరంలో బుధవారం జరిగిన వైసీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు,శారదావాణిల కుమారుడి వివాహానికి మాజీ సీఎం జగన్ హాజరయ్యారు. నూతన దంపతులైన కృష్ణంరాజు- దివ్యలను ఆశీర్వదించారు.

సుప్రీంలో కొల్లేరు కేసు 22కు వాయిదా

ఏలూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కొల్లేరు అభయారణ్యంలో ఆక్రమణల తొలగింపు, అక్కడ ప్రజలకు జిరాయితీ భూముల పంపిణీ, ఇతర అంశాలపై సుప్రీం కోర్టులో బుధవారం ఇరువర్గాలు వాదనలు వినిపిం చాయి. అయితే బెంచ్ తీర్పును ఈనెల 22కు వాయిదా వేసింది. కాకినాడకు చెందిన పర్యావరణవేత్త కె.మృత్యుంజయరావు కొల్లేరు అంశంపై ప్రజా ప్రయోజన వాజ్యం(పిల్) గతంలో దాఖలు చేసిన విషయం విదితమే. ప్రధానంగా ఏపీకి చెందిన అధికారులు కొల్లేరు అంశంలో పర్యావరణం, అక్కడ ప్రజ ల విషయంలో తీసుకున్న వివిధ చర్యలకు సంబంధించి సరైన రికార్డులు సమర్పించని కారణంగా జస్టిస్ సూర్యకాంత్ ఆధ్వర్యంలో బెంచ్ తీర్పును ఈనెల 22కు వాయిదా వేసింది. అప్పటిలోగా పూర్తి సమాచారంతో రావాలని కోర్టు ఆదేశించినట్టు సమాచారం. రాష్ట్ర అటవీ పర్యావరణశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే కూడా మంగళ వారం జిల్లా కలెక్టరేట్‌లో అధికారులు, ఎమ్మెల్యేలతో చర్చించినప్పటికి పూర్తి వివ రాలు రాలేదు. ఇప్పటికే సుప్రీంలో ఈ కేసు పలుమార్లు వాయిదా పడుతున్న నేపథ్యంలో 15 రోజుల వ్యవధిలో 22వ తేదీ నాటికైనా రాష్ట్ర ప్రభుత్వం పూర్తి వివరాలు సమర్పిస్తోందో లేదో వేచి చూడాల్సిందే.

ఉండి-ఆకివీడు రోడ్డు మూసివేత



ఉండి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈనెల 10 నుంచి 17వ తేదీ వరకు ఉండి-ఆకివీడు 165 రహదారిని మూసివేయనున్నట్టు రైల్వే అధికారులు తెలిపారు. ఈ మేరకు ఉండి పెద్దవంతెన సెంటర్‌లో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. గతంలో ముందుగా సమాచారం ఇవ్వకుండా మూసివేశారు. ఈసారి ముందస్తుగా ఫ్లెక్సీని ఏర్పాటుచేశారు. రైల్వే గేటు వద్ద ప్రత్యేకమైన పనులను చేపట్టనున్నట్లు దాంతో రైల్వేగేటు మూసివేస్తున్నామని ప్రయాణికులు, వాహనదారులు సహకారించాలని కోరారు.



ఆచంట రామేశ్వరస్వామి ఆలయాన్ని పరిశీలిస్తున్న దేవదాయ శాఖ డీసీ రమేష్‌బాబు

ఆలయాల్లో పుష్కర పనుల పరిశీలన

ఆచంట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): 2027 జూలైలో జరగనున్న గోదావరి పుష్కరాల్లో భాగంగా బుధవారం దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు, డిప్యూటీ ఇంజనీర్ శ్రీనివాస్, అసిస్టెంట్ కమిషనర్ హరి సూర్య ప్రకాష్‌లు ఆచంట మండలంలోని పెదమల్లం మాచేనమ్మ, పల్లాలమ్మ, కోడేరులోని శివాలయం, ఆచంట రామేశ్వరస్వామి ఆలయాలను పరిశీలించారు. భక్తులకు ఎటువంటి ఏర్పాట్లు ఉండాలి.. ఆలయాల్లో చేట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి పరిశీలన చేపట్టారు. భీమవరం ఇనస్పెక్టర్ పర్ధినీడి వెంకటేశ్వరరావు, ఈవో ఆదిమూలం వెంకట సత్యనారాయణ, ఆలయ చైర్మన్‌లు బోడపాటి సుబ్బారావు, నెక్కంటి గజేశ్వరరావు, తదితరులు ఉన్నారు.



విగ్రహాలతో నిండిపోయిన కోడేరు పుష్కర ఘాట్

కోడేరు పుష్కర ఘాట్‌లో విగ్రహాలు

ఆచంట, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): గోదావరి వరదతో కోడేరు, పెద మల్లం, భీమలాపురం, కరుగోరుమిల్లి పుష్కరఘాట్‌లలో బురద పేరుకు పోయింది. వరద ఉధృతి అనంతరం రేవులను శుభ్రం చేసినప్పటికి కొన్ని సార్లు గోదావరి ఉధృతితో పుష్కరఘాట్‌లలో మట్టితో నిండి ఉన్నాయి. ఇటీవల దసరా ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి విగ్రహాలను కోడేరు పుష్కరఘాట్‌లో నిమజ్జనం చేయడంతో అక్కడే ఉండిపోయాయి. భక్తులు గోదావరిలో స్నానాలు చేయడానికి వీలులేకుండా పోయింది. అధికారులు స్పందించి రేవులను శుభ్రం చేయాలని పలువురు కోరుతున్నారు.



మొగల్తూరు పరిధిలో పొంగిపొర్లుతున్న గొంతేరు డ్రెయిన్

పొంగిపొర్లుతున్న డ్రెయిన్లు

మొగల్తూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో వాయుగుండం కారణంగా చిన్నపాటి వర్షాలకు తోడు ఎగువన పొంగుతున్న డ్రెయిన్లతో దిగువ ప్రాంతంలోని డ్రెయిన్లు పొంగిపొర్లుతున్నాయి. డెల్టా తీరమైన మొగల్తూరు మండలం గొంతేరు, దర్భరేవు, వెస్ట్ కుక్కులేరు, యనమదుర్రు, ఈస్ట్ కుక్కులేరు, చింతరేవు డ్రెయిన్లు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ఆయా డ్రెయిన్‌ల పరిధిలోని వ్యవసాయ భూములు, చెరువులు మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దర్భరేవు డ్రెయిన్ సమీప చేలల్లో ముంపు నీరు బయటకు లాగకపోవడంతో సార్వా సాగుకు క్రాప్ హాలిడే ప్రకటించారు. రామన్నపాలెం పంచాయతీ పరిధిలోని అడవిపర్రలో దర్భరేవు డ్రెయిన్ ముంపుతో సుమారు 1400 ఎకరాలకు కేవలం 100 ఎకరాలు మాత్రమే సాగు చేస్తున్నారు. దర్భరేవు డ్రెయిన్ ప్రక్షాళన చేయాలని రైతులు కోరుతున్నారు.



మాలవానితిప్ప వద్ద పంట కాలువలోకి వదులుతున్న చేపల చెరువు నీరు

కాల్వలో ఆక్వా వ్యర్థ జలం

కాలుష్యం కోరల్లో బొండాడ పంట కాలువ

కాళ్ల, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలో సుమారు పది గ్రామాలకు తాగునీరు, సాగునీరు అందించే బొండాడ పంట కాల్వ చేపల చెరువుల నీటితో కలుషితమవుతోంది. ఒకపక్క పంట కాలువలను పరిరక్షించాలని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణంరాజు పటిష్ట చర్యలు చేపడుతుంటే మరోపక్క ఆక్వా రైతులు నిర్లక్ష్యంగా ఆక్వా వ్యర్థ జలాలు పంట కాలువలోకి వదిలేస్తున్నారని శివారు గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మాలవానితిప్పలో బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒక ఆక్వా రైతు పంట కాలువలోకి కలుషిత నీరు వదిలినా ఎవరూ పట్టించుకోలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల డిప్యూటీ స్పీకర్ ఆదేశాలతో కాలువను పూర్తి స్థాయిలో బాగు చేశారని, కొంత మంది ఇలా కలుషితం చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. క్షేత్రస్థాయిలో కనీస పర్యవేక్షణ లేకపోవడమే ఇందుకు కారణమని, మండల పరిధిలో ఈ కాలువ వెంబడి ముగ్గురు నీటి సంఘం అధ్యక్షులున్నా కలుషితం కాకుండా చూడలేకపోతున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. కలుషిత నీరు కనీసం వాడుకోవడానికి కూడా ఉపయోగపడడం లేదని, పశువులు కూడా తాగడం లేదని శివారు గ్రామ ప్రజలు ఆవేదన చెందుతున్నారు. అధికారులు, నీటి సంఘం అధ్యక్షులు వెంటనే స్పందించి చేపల చెరువు నీటిని పంట కాలువలోకి వదలకుండా తగు చర్యలు తీసుకోవాలని శివారు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



ద్వారకాతిరుమల విర్డ్ ఆసుపత్రి ఎదురుగా రోడ్డుపై సూచిక బోర్డు

ఆ రోడ్డుపై జాగ్రత్త..

ద్వారకాతిరుమల, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): శ్రీవారి క్షేత్రానికి వచ్చే రహదారి తూట్లు పడినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉండడంతో కొందరు వినూత్నంగా రహదారిపై సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. పెద్ద పెద్ద గుంతల్లో పలువురు వాహనదారులు ప్రమాదాల బారిన పడుతుండడంతో బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. దాదాపు ఏడు ప్రాంతాల్లో ఎర్రజెండాలతో సూచిక బోర్డులను ఉంచారు. ద్వారకాతిరుమల, గొల్లగూడెం, పంగిడిగూడెం, తదితర చోట్ల రోడ్డు ఛిద్రమైంది. ద్వారకాతిరుమల విర్డ్ ఆసుపత్రి వద్ద సూచిక బోర్డు 'గుంత' చెబుతున్నట్లు విన్నూత్నంగా ఉండి అధికారులను ఆలోచింపచేస్తోంది.

నన్ను బాగు చేయండి..

గుంత మాట్లాడితే ఎలా ఉంటుందో మీరే చూడండి.. ఇది అజ్ఞాత వ్యక్తులు ఏర్పాటు చేసిన సూచిక బోర్డు సారాంశం.

'ఈ మార్గంలో వెళ్లే వారికి నేను గాయాలు చేస్తున్నాను. నేను ప్రభుత్వాన్ని ప్రాధేయపడుతున్నాను. వాహనదారులకు మరో పెద్దగాయం చేసేలోగా దయచేసి నన్ను బాగుచేయండి.' రోడ్ సేఫ్టీ పేరుతో ఎర్ర జెండాలతో ఇలా బోర్డు ఏర్పాటు చేయడం, గుంతల వద్ద ఇది హెచ్చరికలా పనిచేస్తోంది. ప్రజాప్రతినిధులు అధికారులు స్పందించి ఈ రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాల్సి ఉంది.



ధ్వజస్తంభం వద్ద గరుడపటాన్ని దింపిన అర్చకులు

శాస్త్రోక్తంగా శ్రీచక్రవార్యుత్సవం

- శేషాచలంపై బ్రహ్మోత్సవ సందడి

ద్వారకాతిరుమల, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): శ్రీచక్రవార్యుత్సవం బుధవారం ఉదయం శాస్త్రోక్తంగా జరిగింది. స్వామివారి ఆశ్వయుజ మాస దివ్య బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో చక్రవార్యుత్సవం, మౌన బలి, సాయంత్రం ధ్వజావరోహణ జరిగాయి. శ్రీవారి ఉత్సవ వైభవాన్ని వీక్షించేందుకు వచ్చిన సర్వాది దేవతలకు ఉద్వాసన పలికే క్రమంలో ధ్వజ స్తంభంపై ఎగురవేసిన గరుడ పటాన్ని శాస్త్రోక్తంగా కిందికి దింపడమే ధ్వజావరోహణ.

శ్రీచక్రవార్యుత్సవం ఇలా..

ఆలయ ఆవరణలో శ్రీవారు, అమ్మవార్లు, చక్రపెరుమాళ్లను ఒక వేదికపై ఉంచారు. ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచన జరిపారు. పూజాధికాల అనంతరం సుగంధ ద్రవ్యాలు, పంచ పల్లవులు, శ్రీచందనం, పసుపు, మంత్రపూత జలంతో శ్రీచక్రస్వామిని అభిషేకించారు. అనంతరం పంచామృతాభిషేకాన్ని జరిపి హారతులు ఇచ్చారు. అర్చకులు అభిషేక జలాన్ని భక్తుల శిరస్సులపై జల్లారు. పూర్ణాహుతి హోమాన్ని శాస్త్రబద్ధంగా నిర్వహించిన అనంతరం సర్వాదిదేవతలకు ఉద్వాసనగా ధ్వజావరోహణ భక్తులకు నేత్రపర్వమైంది.

శ్రీవారి గ్రామోత్సవం


చినవెంకన్న ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు, ఉభయదేవేరులతో ప్రతీ నిత్యం వివిధ వాహనాలపై భక్తులను కటాక్షిస్తున్నారు. బుధవారం ఉదయం తొళక్క వాహనం, రాత్రి అశ్వవాహనంపై క్షేత్రపురవీథుల్లో ఊరేగారు.



అశ్వవాహనంపై దివ్యమూర్తులు



మందులు మింగేస్తున్నారా



చిన్నపాటి జ్వరమే కదా.. డాక్టరు దగ్గరకు వెళ్లడం దేనికి.. మందులు వాడేద్దాం.. చాలామంది ఇలాగే ఆలోచిస్తున్నారు. ఇలా చేయడం ప్రాణానికి ముప్పు. ప్రధానంగా చిన్నపిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు మరింత జాగ్రత్తగా ఉండాలి. అవగాహనాలేమి, ఆర్థిక ఇబ్బందులు, దూరాభారం వంటి సమస్యలతో సొంత వైద్యంతో పిల్లల ప్రాణాలమీదికి తెస్తున్నారు. మితిమీరిన మందుల వాడకం, యాంటీబయాటిక్స్‌తో పిల్లలో ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. పిల్లలకు దగ్గు మందు వాడకంలో జాగ్రత్తలు పాటించాలని వైద్యులు హెచ్చరికలు చేస్తున్నారు.

ఉసురు తీస్తున్న విచ్చలవిడి మందుల వాడకం

- ప్రాణాలమీదికి తెస్తున్న అవగాహన లేమి
- సొంత వైద్యం వద్దంటున్న వైద్యులు
- పెరిగిన యాంటీబయోటిక్స్ వినియోగం
- దగ్గు మందు వాడకంలో అజాగ్రత్త

పెదవేగి/పాలకోడేరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సమస్యలపై వైద్యులను సంప్రదించకుండా మందుల వాడడం ప్రాణాంతకం. చిన్నపాటి అనారోగ్య సమస్య ఉంటే మందుల దుకాణంలో తెచ్చిన మందులు వాడడం శ్రేయస్కరం కాదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇటీవల మధ్య ప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో దగ్గు మందు వాడిన చిన్నారులు మృత్యువాత పడ్డారు. దీనితో రెండేళ్లలోపు చిన్నారులకు దగ్గు సిరప్ వాడకాన్ని నిలిపివేస్తూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. చిన్నపిల్లల్లో వ్యాధి నిరోధకశక్తి సహజంగా ఉంటుందని, పరిమితికి మించి మందులు వాడితే నిరోధక శక్తి సన్నగిల్లుతుందని వైద్యులు వివరిస్తున్నారు.

ముక్కు మూసి మందు వేస్తే..

పిల్లలు మందులు వేసుకోవడానికి మారాం చేస్తారు. కొంతమంది తల్లిదండ్రులు పిల్లల ముక్కు మూసి మందు ద్రావణాన్ని నోట్లో వేస్తుంటారు. ఇది చాలా ప్రమాదమని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ముక్కుమూసి మందు వేస్తే ఊపిరితిత్తుల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు. చిన్నారులకు విరేచనాలు అయితే మందులు ఒక్కటే మార్గం కాదని, విరేచనాలు, వాంతుల కారణంగా శరీరంలో నీటిశాతం పడిపోతుందని, ఈ సమయంలో ద్రవరూపంలో శరీరానికి నీరు అందేలా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు స్పష్టంచేస్తున్నారు.

యాంటీబయోటిక్స్

ప్రతి చిన్న ఆరోగ్య సమస్యకు యాంటిబయాటిక్స్ వాడకం మంచిది కాదు. వైద్యుల సూచనలు లేకుండా యాంటీబయాటిక్ మందులు చిన్నపిల్లలకు అసలు ఇవ్వకూడదు. చాలామంది ఆర్ఎంపీలు, పీఎంపీల దగ్గరకు వెళ్లి యాంటీబయాటిక్స్ వాడుతున్న సంఘటనలు కోకొల్లలు. వైద్యులను సంప్రదించకుండా యాంటీబయాటిక్స్ వేసుకోవడం భవిష్యత్‌లో మరిన్ని ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుంది.

నాణ్యతాప్రమాణాలు చూడాలి

ఇటీవల మార్కెట్‌లో నాసిరకం మందుల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఔషధ నియంత్రణ శాఖాధికారులు పలుచోట్ల దాడులు జరిపి నాసిరకం మందులను సీజ్ చేసిన దాఖాలు ఉన్నాయి. ఇలాంటి మందుల వాడకంకూడా ప్రమాదకరమని వైద్యులు చెప్తున్నారు. నాసిరకం మందుల వాడకంపై అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. వైద్యులు ఇలాంటి మందుల వాడకాన్ని ప్రోత్సహించవద్దని ఔషధ నియంత్రణ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

చిన్నారులకు ప్రభుత్వ టీకాలు

ప్రభుత్వం శిశు మరణాలను తగ్గించే విధంగా పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల వరకు వ్యాధి నిరోధక టీకాలను అందిస్తోంది. బిడ్డ పుట్టిన వెంటనే క్షయ నివారణకు బీసీజీ టీకా, కాలేయ వ్యాధి నివారణకు హెపటైటిస్-బి, పోలియో రాకుండా పోలియో చుక్కలు వేస్తోంది. నెలన్నరకు మొదటి డోస్ కింద పోలియో చుక్కలు, ఐపీవీ టీకా, కోరింత దగ్గు, కంఠవాతం, ధనుర్వాతం, మెనైంజైటిస్ రాకుండా టీకా, రెండున్నర నెలల్లో ఓపీవీ, పెంటా వ్యాక్సిన్, రోటా వైరస్ అందిస్తున్నారు. మూడున్నర నెలల్లో ఓపీవీ, ఐపీవీ టీకా, పెంటా వ్యాక్సిన్, పీసీవీ వ్యాక్సిన్, రోటా వ్యాక్సిన్ అందిస్తున్నారు. 9 నెలలు నిండాక ఐపీవీ, పీసీవీ, తట్టు, పొంగు నివారణకు ఎంఆర్ టీకా, బ్రెయిన్ ఫీవర్ నివారణకు జేఈ టీకా అందిస్తుంది. ఐదో సంవత్సరంలో విటమిన్ -ఎ, డీపీటీ, ఎంఆర్ టీకాలు అందిస్తారు.

పిల్లల వయస్సు, బరువు కీలకం



వ్యాధికి గురైన వారికి వైద్యం అందించే సమయంలో వయసుతో పాటు బరువు, ఎత్తు కూడా పరిగణనలోకి తీసుకోవాలి. బరువు, వయస్సు ఆధారంగా మందు మోతాదు ఉంటుంది. పిల్లల్లో వ్యాధి నిర్ధారణ అనంతరం డాక్టర్ సూచించిన మందులు పూర్తిగా వాడాలి. మధ్యలో మానేస్తే వ్యాధి కారక జీవి మరింతగా విజృంభించే ప్రమాదం ఉంది.

- డాక్టర్ ఎస్.అల్బర్ట్, ఏలూరు

చీటీ లేకుండా దగ్గు మందు వద్దు



చిన్న పిల్లలకు దగ్గు తీవ్రమైతే డాక్టర్ పర్యవేక్షణలో సిరప్ తాగించాలి. పాత చీటీ చూపించి అవే సిరప్ కొనకూడదు. వయస్సు, బరువు ఆధారంగా మందు పరిమాణం మారుస్తారు. దగ్గుతో పాటు జలుబు, జ్వరం ఉన్నప్పుడు సిరప్ ఒకే దాంట్లో ఉంటుందనే డాక్టర్ అప్పటి పరిస్థితిని బట్టి చీటి రాస్తారు. వేర్వేరుగా సిరప్‌లు వాడడం ఉత్తమం.

- డాక్టర్ పీఏఆర్ఎస్.శ్రీనివాస్, ఏలూరు

ఆరు నెలల వరకు తల్లిపాలు ఇవ్వాలి



చిన్నారులకు తల్లిపాలే అమృతం. పుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టాలి. బిడ్డకు ఆరు నెలలపాటు తల్లిపాలు పట్టించాలి. తల్లిపాలతో చిన్న పిల్లలకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. తద్వారా రోగాలను నివారించుకోవచ్చు. ఆరు నెలలు వచ్చే వరకు ఎటువంటి ఆహారం ఇవ్వవద్దు. తల్లిపాలే పట్టిస్తూ పిల్లల ఆరోగ్యానికి భద్రత కల్పించండి.

- డాక్టర్ ఎస్.కృష్ణదుర్గ, యూపీహెచ్‌సీ, దుర్గాపురం

డాక్టర్‌ను సంప్రదించండి



వైద్యులను సంప్రదించకుండా మందుల షాపుల్లో వెళ్లి మందులు వాడొద్దు. ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ఆసుపత్రులను తీసుకువచ్చింది. వైద్యుని సలహా తీసుకుని మందులు వాడాలి. చిన్న పిల్లలకైతే వెంటనే మందులు వాడొద్దు. కొన్ని రోజులు చూసిన అనంతరమే వైద్యుడి సలహా మేరకే మందులు వాడండి.

- డాక్టర్ హసిత, యూపీహెచ్‌సీ, దుర్గాపురం



కలల పండుగ

కలల రాకుమారుడు భర్త కావాలని యువతులు, కట్టుకున్న భర్త క్షేమం కోరే వివాహితలు చేసే పండుగ అట్లతద్ది. అశ్వయుజ బహుళ తదియ నాడు స్త్రీల పండుగ. ఉయ్యాల పండుగ.. గోరింటాకు పండుగ అని కూడా అంటారు. గౌరీదేవి శివుని భర్తగా పొందాలని కృతనిశ్చయంతో ఉండడంతో త్రిలోక సంచారి నారదుడు ఆమెకు అట్లతద్ది వ్రతం చేయమని సూచిస్తాడు. పార్వతిదేవి పూజలను గౌరీ వ్రతంగా మహిళలు ఆచరిస్తారు.

నేడు అట్ల తద్ది

పోలవరం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): నోముల పంట పండించే పండుగను అట్లతద్ది అని కూడా పిలుస్తారు. తెలుగువారి పండుగలలో ఇది ఒకటి. అట్ల తద్దె ఆరట్లు.. ముద్ద పప్పు మూడట్లు.. అంటూ ఆడపడుచులకు బంధువులకు ఇరుగు పొరుగులకు వాయనాలివ్వడం ఆనవాయితీ. రోజంతా కఠిక ఉపవాసం ఉండి సాయంత్ర సమయంలో వాయినాలు ఇచ్చి నైవేద్యాలు పూర్తి చేసుకుని గోపూజకు వెళ్లి అటు నుంచి గోదావరి, చెరువు, కాల్వల్లో దీపాలు వదిలి చెట్లకు ఊయలలు కట్టి ఊగడం చేయడం స్త్రీల ఆచారం.

ఈ పండుగలో చంద్రారాధన ప్రధానమైనది. చంద్ర కళల్లో కొలువైవున్న శక్తి అనుగ్రహంతో స్త్రీ సౌభాగ్యం పెరుగుతుందని, సుఖశాంతులు వర్థిల్లుతాయని నమ్మకం. అట్లు నైవేద్యంగా పెట్టడంలో అంతరార్థమేమిటంటే నవగ్రహాల్లో ఒకటైన కుజుడికి అట్లంటే మహా ప్రీతి ఆయనకు నేవైద్యం పెట్టడం వలన కుజదోష పరిహారమై సంసార సుఖంలో ఎటువంటి అడ్డంకులు రావని, రజోదయమునకు కారకుడు కావడం వలన రుతుచక్రం సరిగా ఉంచి రుతు సమస్యలు, గర్భధారణ సమస్యలు, గర్భస్రావం కాకుండా కుజుడు కాపాడుతాడని నమ్ముతారు.

వ్రత విధానం ఇలా..

అట్లతద్ది రోజు ముందు రోజు కాళ్లు చేతులకు అందంగా గోరింటాకు పెట్టుకుని గుమ్మాలకు తోరణాలు కడతారు. ఆడవారు తెల్లవారుజామున తలారా స్నానం చేసి రాత్రి సిద్ధం చేసిన చద్ది అన్నం గోంగూర పచ్చడితో భోజనం చేసి ఉపవాసం ఉంటారు. ఇంట్లో తూర్పు దిక్కున మండపం పెట్టి గౌరీదేవి పూజ చేసి ధూప, దీప, నేవైద్యాలు పెట్టి వినాయక పూజ తర్వాత గౌరీ పూజ స్తోత్రం శ్లోకాలు, పాటలు పాడడం చేస్తారు. సాయంత్రం చంద్రదర్శనం తర్వాత మళ్లీ గౌరీపూజ చేసి 11 అట్లు 11 రకాల ఫలాలు నైవేద్యంగా పెట్టి ముత్తైదువులకు అలంకారం చేసి వాయినాలు ఇస్తారు. ఇస్తినమ్మ వాయినం పుచ్చు కుంటినమ్మ వాయినం అంటూ పాడుతారు. ముత్తైదువులకు నల్లపూసలు, లక్కకోళ్ళు రవికల గుడ్డ, దక్షిణ తాంబూలాలు ఇచ్చి తాము కూడా భోజనం చేస్తారు.



కోరుకున్న వాడి పేరు చెప్పాల్సిందే..!

కన్నెపిల్లలను ఊయలలెక్కించి వేగంగా ఊపుతూ కోరుకున్న వాడి చెబితే గానీ వదలరు. సరదాగా అభిమాన హీరో, క్రికెటర్ పేరు చెప్పి యువతులు తప్పించుకుంటారు. కన్నెపిల్లలంతా లయబద్ధంగా చేసే అట్లతద్ది నాట్యం చూపరులను భలే ఆకట్టుకుంటుంది.

భారత పారా త్రో బాల్ జట్టు మేనేజర్‌గా యడ్లపల్లి



అత్తిలి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక రత్నాపుర్ ఇండోర్ స్టేడియంలో డిసెంబరులో సౌత్ ఏషియన్ పారా త్రోబాల్ చాంపియన్ షిప్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనే భారత పారా త్రో బాల్ జట్టు మేనే జర్‌గా అత్తిలికి చెందిన యడ్లపల్లి సూర్యనారా యణ ఎన్నికయ్యారని ఏపీ పారా త్రోబాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గండా కైలాష్ రెడ్డి బుధవారం తెలిపారు. ఆగస్టు 30నుంచి 31 వరకు కోయంబత్తూర్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీలలో పాల్గొన్న ఆంధ్ర పారా త్రో బాల్ జట్టుకు సూర్యనారాయణ మేనేజర్‌గా వ్యవహరించారని తెలిపారు. ఈ పోటీలలో రాష్ట్ర జట్టు విజేతగా నిలిచిందని కైలాష్ తెలి పారు. శ్రీలంకలో జరిగే ఏషియన్ పారా త్రోబాల్ ఛాంపియన్‌షిప్‌కు తనపై నమ్మకం ఉంచి మేనేజర్‌గా అవకాశం కల్పించిన పారా సిట్టింగ్ త్రో బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు ఆల్బర్ట్, ఆంధ్ర పారా త్రో బాల్ కార్యదర్శి కైలాష్ రెడ్డికి యడ్లపల్లి సూర్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు.

రేపు ఉమ్మడి జిల్లా క్రీడా జట్ల ఎంపికలు

ఏలూరు అర్బన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో అన్ని యాజమాన్యాల ఉన్నత పాఠశాలల విద్యార్థులకు అండర్-14, 17 విభాగాల్లో జిల్లా క్రీడా జట్ల ఎంపికల షెడ్యూలు ఖరారైంది. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షులు, డీఈవో వెంకటలక్ష్మమ్మ, జిల్లా కార్యదర్శి కె.అలివేలుమంగ బుధవారం వివరాలు తెలిపారు. ఈ నెల 10న ఉదయం 9గంటలకు కొవ్వలి జడ్పీ హైస్కూలులో బాస్కెట్‌బాల్, ఏలూరు ఇండోర్ స్టేడియంలో రెజ్లింగ్ క్రీడల్లో ఎంపికలు జరుగుతాయని వివరించారు. క్రీడాకారులు వారు చదువుతున్న స్కూలు హెచ్‌ఎం సంతకంచేసిన ఎంట్రీఫారం తెచ్చుకోవాలని, దీంతోపాటు క్రీడా దుస్తులు, వాటర్ బాటిల్ కూడా తెచ్చుకోవాలని సూచించారు. వివరాలకు ఫోన్ నంబరు 90308 94311లో సంప్రదించాలని కోరారు.



సినిమాకు క్లాప్ కొడుతున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

రాచర్లలో మహానాగ సినిమా షూటింగ్

పెంటపాడు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మహానాగ సినిమా విజయవంతం కావాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆకాంక్షించారు. మండలంలోని రాచర్ల గ్రామంలో మహానాగ సినిమా చిత్రీకరణకు బుధవారం ఆయన క్లాప్ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా సినిమా డైరెక్టర్ ఉదయభాస్కర వాగ్దేవి మాట్లాడుతూ ప్రముఖ నటుడు సుమన్‌తో పాటూ రమాకాంత్, శ్రావణి, శ్రీకావ్య, బస్టాప్ కోటేశ్వరరావు, జబర్దస్త్ అప్పారావు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారన్నారు. సినిమాను ప్రేక్షకులందరూ థియేటర్లకు వచ్చి చూసి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అంబికా కృష్ణ, బేతిన గిరిధర్, పాలూరి వెంకటేశ్వరరావు తదితరుల పాల్గొన్నారు.



ఎంపికైన జిల్లా జట్లతో వ్యాయామోపాధ్యాయులు

ఉమ్మడి జిల్లా అండర్- 19 క్రీడా జట్ల ఎంపిక

పెదవేగి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) 19ఏళ్ల విభాగం ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక పోటీలు బీఆర్.అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో బుధవారం జరిగాయి. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, త్రోబాల్, బాల్ బాడ్మింటన్, చెస్, యోగాసన పోటీలకు జిల్లా జట్లను ఎంపిక చేశారు. ఉమ్మడి జిల్లా జట్లను ఎంపిక చేశామని జిల్లా కార్యదర్శి కె.జయరాజుతెలిపారు. ఎంపికైన జిల్లా జట్లు త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని ఆయన తెలిపారు. ఈ ఎంపిక పోటీల్లో గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ ఏవీ.శివప్రసాద్, హేలాపురి ఇంజనీరింగ్ కళాశాల ఏవో కరుణానిధి, పీడీలు రాజా, శ్రీనివాస్, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



జాబ్ మేళాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట్రాజు

సంకల్పం ఉంటే ఏదైనా సాధించగలం

- నల్లజర్ల మెగా జాబ్‌మేళాలో ఎమ్మెల్యే వెంకట్రాజు
- 1800 మంది నిరుద్యోగులు హాజరు.. 315 మంది ఎంపిక

నల్లజర్ల, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి):దృఢ సంకల్పం, నిరంతర కృషితో జీవితంలో ఏదైనా సాధించగలమని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అన్నారు. ఎమ్మెల్యే సారథ్యంలో నల్లజర్ల హైస్కూల్‌లో 30 కంపెనీలతో బుధవారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. 1800 మంది నిరుద్యోగులు హాజరు కాగా 315 మందికి ఆఫర్ లెటర్లు అందించారు. ఎమ్మెల్యే మద్దిపాటి మాట్లాడుతూ యువత అన్ని రంగాల్లో నైపుణ్యం కలిగి ఉండాలన్నారు. సీఎం చంద్రబాబు యువతకు నైపుణ్యం పెంచేందుకు 2014 పాలనలో అనేక సెంటర్లు ఏర్పాటు చేశారన్నారు. మంత్రి లోకేశ్ ఆదేశాల మేరకు యువతకు నైపుణ్యం పెంచి ఉద్యోగావకాశాలు కల్పించే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. వచ్చే నాలుగేళ్లలో గోపాలపురంలో నిరుద్యోగ సమస్య లేకుండా స్కిల్ సెంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. జడ్పీ మాజీ ఛైర్మన్ ముళ్లపూడి బాపిరాజు మాట్లాడుతూ నల్లజర్లలో 100 కుటుంబాలు అమెరికాలో స్థిరపడ్డాయని, అందుకు కారణం నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయాలే అన్నారు. ఏఎంసీ ఛైర్మన్ యద్దనపూడి బ్రహ్మారాజు, పసుమర్తి రతీష్, యలమాటి శ్రీనివాస్, టీడీపీ మండల అధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, జనసేన నియోజకవర్గ కన్వీనర్ దొడ్డిగర్ల సువర్ణరాజు, షేక్ మీరా సాహెబ్, తదితరులు పాల్గొన్నారు.



రిలయన్స్‌లో ఉద్యోగం : డి.వేణు, గోపాలపురం

నేను డిగ్రీ పూర్తి చేసి రెండేళ్లయ్యింది. అనేక పరిశ్రమలకు ఇంటర్వ్యూలకు వెళ్లా. జాబ్ దొరకలేదు. ఎన్నో ఇబ్బందులు పడ్డా. నల్లజర్ల జరిగిన జాబ్‌మేళాలో నెలకు రూ.15 వేలు జీతంతో బెంగళూరులో రిలయన్స్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్‌లో ఉద్యోగం వచ్చింది.



టాటాలో ఉద్యోగం : మిద్దే జాహ్నవి, పుల్లలపాడు

నేను ఇంటర్ వరకు చదువుకున్నా. ఉద్యోగాల కోసం హైదరాబాదు, బెంగళూరు వంటి సిటీలకు వెళ్లి కంపెనీల చుట్టూ తిరగనవసరం లేకుండా నల్లజర్లలోనే జాబ్‌మేళా నిర్వహించడం ఆనందంగా వుంది. నాకు బెంగళూరు టాటా కంపెనీలో ఉద్యోగం వచ్చింది. నెలకు రూ.13 వేలు జీతం.



టెక్రియా 2025 కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ దినేష్ శంకర్‌రెడ్డి

నేటి నుంచి నిట్‌లో టెక్రియా 2025

తాడేపల్లిగూడెం అర్బన్, అక్టోబరు 8(ఆంధ్ర జ్యోతి):విద్యార్థులలో వైజ్ఞానిక సృహను పెంచేందుకు టెక్రియా వంటి కార్యక్రమాలు దోహదపడతాయని ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి అన్నారు. తాడేపల్లిగూడెం నిట్‌లో 19, 11 తేదీలలో నిర్వహించే టెక్రియా 2 కే 25ను ప్రాంగణంలో దినేష్ కర్టెన్ రైజర్ కార్యక్రమంతో ప్రారంభించారు. కో ఆర్డినేటర్‌గా అసోసియేట్ డీన్ డాక్టర్ రాజేశ్వరరెడ్డి వ్యవహరించారు. విద్యార్థుల నృత్యాలు, ఆటపాటలు అలరించాయి. టెక్రియాలో రోబోటిక్స్, ఆటోమేషన్, అల్టిమేట్ డ్రోన్, డ్రోన్ చాలెంజ్, సెరినిటి రూం, ఇంజనీర్స్ డ్రైవ్‌వే తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ముగిసిన హార్టీ సెట్ కౌన్సెలింగ్

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి):డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వ విద్యాలయం పరిధిలో బీఎస్సీ హార్టీకల్చర్ (హానర్స్) కోర్సులో ప్రవేశానికి నిర్వహించిన హార్టిసెట్ కౌన్సెలింగ్ బుధవారం పూర్తయింది. కౌన్సెలింగ్‌లో రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు 66 మందికి ప్రవేశ పత్రాలు అందించారు. విశ్వ విద్యాలయ అధికారులు పాల్గొన్నారు.



ప్రవేశ పత్రాలు అందిస్తున్న రిజిస్ట్రార్

సంక్షేమ ఫలాలు అందుతున్నాయా?

ప్రజలకు రాష్ట్రీయ జన సంక్షేమ సేన బహిరంగ లేఖ

పాలకొల్లు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ ప్రభుత్వంలోని పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల మేరకు వెనుకబడిన అన్ని సామాజిక వర్గాలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయా? లేదా? అనే అంశాలపై రాష్ట్రీయ జన సంక్షేమ సేన దృష్టి సారించింది. ఈ మేరకు ప్రజాభిప్రాయాన్ని కోరుతూ అధ్యక్షుడు చేగొండి హరిరామజోగయ్య బుధవారం బహిరంగ లేఖ విడుదల చేశారు. 2024లో జరిగిన ఎన్నికల్లో అధికారంలో వచ్చిన కూటమి పార్టీలు మేనిఫెస్టో మేరకు హామీలు అమలుపై అభిప్రాయాలు చెప్పాలన్నారు. ఆర్థికంగా వెనుకబడిన సామాజిక వర్గాల సంక్షేమమే ధ్యేయంగా అధికార పార్టీలు చేసిన వాగ్దానాలు, ఎన్ని అమలు చేశారు పరిశీలించాలన్నారు. ప్రారంభించి ఇంకా పూర్తి చేయాల్సినవి, అమలైన వాటిలో లబ్ధిదారులకు నిర్దేశిత అర్హతలు ఉన్నాయా.. ఏవైనా మార్పులు చేయాలా అనే అంశాలపై సమాచారాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడమే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. సమాచారాన్ని అధ్యక్షుడు, రాష్ట్రీయ జన సంక్షేమ సేన సెల్ నంబర్లు 98486 34249, 92914 64646 తెలియజేయాలని జోగయ్య పేర్కొన్నారు.

పారా లీగల్ వలంటీర్లు వారధిగా పనిచేయాలి

ఏలూరు క్రైం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పారా లీగల్ వలంటీర్లు కక్షిదారులు, న్యాయ సేవాధికార సంస్థకు వారధిగా పనిచేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార భవనంలో పారా లీగల్ వలంటీర్లకు బుధవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ వివిధ చట్టాలపై అవగాహన కలిగించారు.



అండర్ కరెంట్ షాక్

- పేరుపాలెం బీచ్‌లో పొంచి ఉన్న ముప్పు
- ఏటా 20 మందికి పైగా బలి

(మొగల్తూరు-ఆంధ్రజ్యోతి)

వినోదం పేరుతో సాగర తీరానికి వచ్చే పలు కుటుంబాల్లో విషాదం నెలకొంటోంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోనే పేరుగాంచిన పేరుపాలెం, కేపీపాలెం సాగర తీరానికి నిత్యం భారీ సంఖ్యలో సందర్శకులు, యువతీ, యువకులు రావటం పరిపాటి. సాగరతీరం వెంబడి గల ఇసుక తిన్నెలు, కొబ్బరి, సరుగుడు తోటల్లో ఆటపాటలతో గడిపితే ప్రమాదం లేదు. ఇలాంటి వారు సురక్షితంగానే ఇంటికి వెళుతున్నారు. అసలు ప్రమాదమంతా సముద్ర స్నానానికి దిగిన వారితోనే.. ఆదివారం, ఇతర సెలవు దినాల్లో, కార్తీక మాసంలోనూ సరదాగా తీరం నందు గడపటానికి ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా రాష్ట్రంలో అనేక ప్రాంతాల నుంచి భారీగా సందర్శకులు, యువతీ, యువకులు ముఖ్యంగా విద్యార్థులు తీరానికి చేరుకుంటున్నారు. సముద్ర స్నానానికి దిగితే ఇక్కడ వచ్చే అలల ఉధృతికి కొట్టుకుపోయి విగత జీవులుగా మారి తీరానికి కొట్టుకు వస్తున్నారు. ఇలా రెండు దశాబ్దాలుగా ఏడాదికి 10 నుంచి 20 మంది పైబడి యువకులు సముద్ర స్నానానికి దిగి గల్లంతై మృతి చెందారు.

అండర్ కరెంట్ అంటే..

పేరుపాలెం సముద్రంలో సముద్ర స్నానానికి దిగిన వారి కాళ్ళ కింద నుంచి ఇసుక నీళ్లలో కొట్టుకుపోయి వెంటనే ఆ ప్రాంతంలో పెద్ద గొయ్యి ఏర్పడి అకస్మాత్తుగా పడిపోతుంటారు. దీంతో వచ్చే కెరటాల ఉధృతిని తట్టుకుని కెరటం వస్తే గంతెయ్యకపోతే కొట్టుకుపోయే ప్రమాదం ఉంది.
మద్యం సేవించిన వారిలో అత్యధికంగా గల్లంతై మృతి చెందుతున్నారు. సముద్రంలో దిగిన యువకులు బంతాటల కోసం ఎగరడం, కెరటాల ఉధృతితో అధిక నీరు సేవించి ఉక్కిరిబిక్కిరై మృతి చెందుతున్నారు.

దుఃఖ సాగరంలో కుటుంబాలు

కుటుంబంలో ఒకే ఒక్క కుమారుడు కలిగి ఉండే ఈ రోజుల్లో అతనిపై ఎన్నో ఆశలు పెట్టుకుంటున్న ఆ తల్లిదండ్రులు ఎంతో కష్టపడి ఇంజనీరింగ్, వైద్య విద్య వంటి ఉన్నత చదువులు చదివిస్తున్నారు. అయితే తల్లిదండ్రులను కలలను సాకారం చేయాల్సిన వయస్సులో విద్యార్థులు, యువకులు తల్లిదండ్రులకు తెలియకుండా కేపీపాలెం, పేరుపాలెం సాగర తీరాలకు చేరుకుని సముద్ర స్నానం చేస్తూ మృత్యువాత పడుతున్నారు. ఈ సంఘటనలు జరిగిన సమయంలో ఎక్కడెక్కడో ఉండే తల్లిదండ్రులు ఇక్కడకు వచ్చి మృతదేహం దొరికే వరకూ వేచి చూడటంతోపాటు మృతి చెందిన కుమారుడిపై పెట్టుకున్న ఆశలు గంగపాలు కావడంతో తీవ్ర మనోవేదన అనుభవిస్తున్నారు.
ఇక్కడ ప్రాణ నష్టం ఉండటంతో అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి బాధిత కుటుంబాలను దృష్టిలో పెట్టుకుని ఇక్కడ స్నానాలకు అనుమతించకుండా తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



సభలో పాల్గొన్న మాజీ డీజీపీ మాలకొండయ్య, మాజీ హోం సెక్రటరీ గౌతమ్ కుమార్, ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ కిశోర్

రిటైర్మెంట్ జీవనం ఆనందంగా సాగాలి

ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్

ఏలూరు క్రైం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి):'విధి నిర్వహణలో ప్రజా సేవకు అంకితమయ్యారు.. పదవీ విరమణ తర్వాత ఆరోగ్యంగా కుటుంబాలతో సంతోషంగా జీవించాలి' అని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ ఆకాంక్షించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రిటైర్డ్ పోలీసు అధికారుల సంఘం 7వ వార్షికోత్సవం ఏలూరు రిటైర్డ్ పోలీసు అధికారుల సంఘ భవనంలో బుధవారం నిర్వహించారు. ఎస్పీ కేపీఎస్ కిశోర్ మాట్లాడుతూ రానున్న పోలీస్ కానిస్టేబుళ్ళ ట్రైనింగ్ సమయంలో మాజీ అధికారుల సేవలను వినియోగించుకుంటామన్నారు. మాజీ హోం సెక్రటరీ గౌతమ్ కుమార్ మాట్లాడుతూ రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ పి.రత్నయ్య మరణం బాధాకరమని కన్నీటి పర్యంతమయ్యారు. మాజీ డీజీపీ ఎం.మాలకొండయ్య, ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పోలీసు అధికారుల సంఘ అధ్యక్షుడు పీవీఎస్‌కె భగవాన్‌రాజు, కార్యదర్శి ఎస్.దాశరథి, ఎల్. సత్యనారాయణ, కె.రాజగోపాల్ తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా శ్రీ సురేష్ చంద్ర బహుగుణ ఇంగ్లీషు మీడియం స్కూలు విద్యార్థులు 12 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. వెయ్యి చొప్పున ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. 15 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. పలువురు రిటైర్డ్ సీనియర్ అధికారులను సన్మానించారు.



పాల్గొన్న రిటైర్డ్ పోలీసు అధికారులు

13న విధుల్లోకి కొత్త టీచర్లు

నేటి ఉదయం నుంచే వెబ్ కౌన్సెలింగ్‌కు ఏర్పాట్లు

ఏలూరు అర్బన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి):మెగా డీఎస్సీ-2025 టీచర్లకు నిర్వహిస్తోన్న ఇండక్షన్ ట్రైనింగ్ ముగింపు దశకు చేరుకోవడంతో గురువారం పోస్టింగ్స్ కౌన్సెలింగ్ నిర్వహించడానికి విద్యాశాఖ కసరత్తును పూర్తి చేసింది. ప్రస్తుతం కొత్త టీచర్లకు శిక్షణనిస్తున్న సెంటర్లలోనే వెబ్ కౌన్సెలింగ్‌ను గురువారం ఉదయం నుంచి నిర్వహించడానికి ఉమ్మడి జిల్లా విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఎంచుకున్న పాఠశాలలకు నియామక పత్రాలను ఈ నెల 13 లేదా ఒకరోజు ముందుగా ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకునేలా వెసులుబాటు కల్పిస్తున్నారు. వెబ్ కౌన్సెలింగ్ నిర్వహణ మొత్తం రాష్ట్రస్థాయిలోనే పాఠశాల విద్య కమిషనరేట్ కేంద్రంగా జరుగుతుంది. జిల్లాలో పర్యవేక్షణ మాత్రం చేస్తారు.

ఉమ్మడి జిల్లాలో మొత్తం 1026 వెకెన్సీల జాబితాను ఖరారు చేశారు. ముఖ్యంగా కుక్కునూరు, వేలేరు పాడు, పోలవరం, బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి వంటి ఏజెన్సీ మండలాల్లో వెకెన్సీలు ఎక్కువ వున్నాయి. ప్లెయిన్ మండలాల్లో స్వల్పంగా ఉన్నాయి. ఆ ప్రకారం 834 వెకెన్సీలు జడ్పీ/ ఎంపీపీ/ ప్రభుత్వ యాజమాన్యంలో కొత్త టీచర్లు ఎంచుకునేలా జాబితాను ఖరారు చేశారు. ఇక ఉమ్మడి జిల్లాలోని 7 పురపాలక సంఘాల్లో మొత్తం 148 వెకెన్సీలు, ఏలూరు నగరపాలక సంస్థ యాజమాన్యంలో 44 వెకెన్సీలు కౌన్సెలింగ్‌లో ప్రదర్శిస్తారు. డీఎస్సీ దరఖాస్తు సమయంలో అభ్యర్థి ఎంచుకున్న యాజమాన్యం నుంచే వెకెన్సీలకు అభీష్టాన్ని తెలపాల్సి ఉంటుంది. ఈ జాబితాల ప్రకారమే పోస్టింగ్స్ కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తారు. జిల్లాలో కేటగిరీ-3, 4 విభాగాల్లోని వెకెన్సీలను భర్తీచేసిన తర్వాతే మిగతా కేటగిరీల ఖాళీలను ప్రదర్శిస్తారు. ఇక జువనైల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఏలూరు శనివారపుపేటలో నిర్వహిస్తోన్న ప్రభుత్వ బాలుర వసతిగృహం పాఠశాలలో టీచర్ల నియామకాలకు డీఎస్సీలో నోటిఫై చేసిన 7 పోస్టులకు కౌన్సెలింగ్‌తో నిమిత్తం లేకుండా నేరుగా నియామకాలు జరుపుతారు. కొత్త టీచర్లంతా ఈ నెల 13న విధుల్లో చేరాల్సి ఉంటుంది.

మున్సిపల్ టీచర్లు... జాయినింగ్ సర్‌ప్లస్!

డీఎస్సీ దరఖాస్తు సమయంలో ఏలూరు నగరపాలక సంస్థ, మరో 7 పురపాలక సంఘాలకు నోటిఫై చేసిన పోస్టులకు ఆప్షన్ ఇచ్చి, ఆ మేరకు నియామకాలు పొందిన కొత్త టీచర్లకు విచిత్ర పరిస్థితులు ఎదురు కానున్నాయి. ఆయా పాఠశాలల్లో సర్‌ప్లస్ ఉపాధ్యాయులు ఇప్పటికే ఇబ్బడిముబ్బడిగా ఉన్నారు. ఏలూరు నగరపాలక సంస్థ పాఠశాలల్లో అదనంగా సుమారు 90 మంది ఉండిపోవడంతో ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే క్లస్టర్ టీచర్లుగా ఎంపిక చేసిన క్లస్టర్ పాఠశాలల్లో రిజర్వ్‌లో ఉంచారు. ఆ మేరకు కార్పొరేషన్ పాఠశాలల్లో ఎవరైనా ఉపాధ్యాయుడు సెలవు పెడితే సంబంధిత పాఠశాలకు వెళ్లి బోధించడానికి క్లస్టర్ టీచర్లను ఉద్దేశించారు. ఇలా కార్పొరేషన్ పాఠశాలల్లో గుర్తించిన సుమారు 90 మంది ఉపాధ్యాయులను నగరంలోని మూడు క్లస్టర్ హైస్కూళ్లలో రిజర్వ్‌లో ఉంచారు. ఈ క్రమంలోనే తాజాగా మెగా డీఎస్సీ-2025 రిక్రూట్‌మెంట్‌లో ఏలూరు నగరపాలక సంస్థకు మరో 44 మంది కొత్త ఉపాధ్యాయులు నియమితులయ్యారు.

ఇదే పద్ధతిన ఉమ్మడి జిల్లాలోని తాడేపల్లిగూడెం, భీమవరం, నిడదవోలు, తణుకు, నరసాపురం, కొవ్వూరు, పాలకొల్లు మున్సిపల్ పాఠశాలలకు మొత్తం 148 మంది ఉపాధ్యాయులు మెగా డీఎస్సీలో నియమితులయ్యారు. ఇప్పటికే ఈ మున్సిపాల్టీల్లో సర్‌ప్లస్‌లో ఉన్న టీచర్లను కొన్ని పాఠశాలలకు సర్దుబాటు చేయగా, ఇపుడు కొత్తగా వచ్చే డీఎస్సీ ఉపాధ్యాయులను క్లస్టర్ పాఠశాలలకు కేటాయించడం మినహా మరో మార్గంలేదని విద్యాశాఖ వర్గాలు వెల్లడించాయి. ఆ ప్రకారం ఏలూరు కార్పొరేషన్, 7 మున్సిపాల్టీల పాఠశాలలకు నియమితులయ్యే కొత్త టీచర్లంతా విధులు చేపట్టే తొలిరోజు నుంచే జాయినింగ్ సర్‌ప్లస్ టీచర్లుగా ఉంటారని క్షేత్రస్థాయి పరిస్థితులు సంకేతాలిస్తున్నాయి. రోజువారీ తరగతి గది బోధన విధులకు అవకాశం లేని సందర్భంలో సంబంధిత సర్‌ప్లస్ టీచర్లను ఇంతకుముందు డీఈవో పూల్‌లో ఉంచినట్టుగానే, ఇపుడు క్లస్టర్ స్కూళ్లకు పంపించి సర్దుబాటు చేయడంతోపాటు, అవసరమైనపుడు ఆయా పాఠశాలలకు ప్రత్యామ్నాయంగా పంపి సేవలను వినియోగించుకుంటారు.

రక్తదానం చేసి.. అనారోగ్యంతో యువకుడి మృతి!

భీమవరం క్రైం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): స్నేహితుడి బంధువులకు రక్తదానం చేసిన అనంతరం అనారోగ్యానికి గురైన ఒక యువకుడు మృతి చెందాడు. భీమవరం వన్ టౌన్ ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పాలకోడేరు మండలం మోగల్లు గ్రామానికి చెందిన నామవరపు నరేశ్(26) ఈ నెల 7వ తేదీన భీమవరం పట్టణం వచ్చి తన స్నేహితుడి బంధువులకు అనారోగ్యంగా ఉండటంతో రక్తదానం చేశాడు. అనంతరం స్పృహ తప్పి పడిపోవడంతో అతడిని ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్టు ఎస్ఐ తెలిపారు. దీనిపై పూర్తి వివరాలు సేకరిస్తున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

రవాణా శాఖ సీజ్ చేసిన వాహనాలకు 22న వేలం


ఏలూరు క్రైం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రవాణాశాఖ అధికారులు సీజ్ చేసిన వాహనాలను ఈ నెల 22న జంగారెడ్డిగూడెం ఆర్టీవో కార్యాలయం వద్ద బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు జిల్లా ట్రాన్స్‌పోర్టు డిప్యూటీ కమిషనర్ షేక్ కరీమ్ తెలిపారు. చాలా కాలంగా పన్ను చెల్లించకుండా, ఫిట్ నెస్ లేకుండా ఇతర కారణాలతో వాహన తనిఖీల్లో అధికారులు వాహనాలు సీజ్ చేసినట్టు తెలిపారు. వాహన యజమానికి, ఫైనాన్షియర్లకు నోటీసులు జారీ చేసినప్పటికీ వారి నుంచి ఇప్పటికి స్పందన లేదన్నారు. ఈ నేపథ్యంలోనే ఆ వాహనాలను బహిరంగ వేలం వేసి వచ్చిన సొమ్ములను ప్రభుత్వ ఖజానాకు జమ చేయనున్నట్టు డీటీసీ తెలిపారు. ఈ వేలంలో మూడు గూడ్స్ క్యారీయర్లు, ఒక మ్యాక్సీ క్యాబ్, మూడు ట్రాక్టర్లు, తొమ్మిది మోటార్ సైకిళ్లు ఉన్నట్టు తెలిపారు. జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపోలో ఈ నెల 22న ఉదయం 10 గంటలకు వాహనాలకు బహిరంగ వేలం వేస్తామని పాల్గొనే అభ్యర్థులు రూ.ఐదు వేలు నగదు రూపంలో డిపాజిట్ చెల్లించాలని, ఆధార్ కార్డు జిరాక్స్‌లు తీసుకురావాలన్నారు. వేలంలో స్క్రాప్‌గా అమ్మిన వాటికి సీబుక్ మంజూరు చేయబడదన్నారు.

సెంటిమెంట్ పేరుతో భక్తుల నుంచి డబ్బు వసూలు

పోలీసులకు అప్పగించిన ఆలయ సెక్యూరిటీ

ద్వారకాతిరుమల, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): భిక్షమెత్తుకుని స్వామి వారి మొక్కు తీర్చుకుంటున్నానంటూ సెంటిమెంట్‌తో భక్తుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న ఓ మహిళను భద్రతా సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. ఈమెను స్థానిక పోలీసు స్టేషన్‌కు అప్పగించారు. ఏలూరుకు చెందిన ఓ మహిళ ఆలయ పరిసరాల్లో కొన్నాళ్లుగా భిక్షాటన చేస్తోంది. ఈ క్రమంలో భక్తుల నుంచి రూ.100 నుంచి రూ.500 వరకూ వసూలు చేస్తోంది. సిబ్బంది పలుమార్లు హెచ్చరించినా పద్ధతి మార్చుకోకపోవడంతో పోలీస్టేషన్‌లో అప్పగించారు.

ఇంట్లోకి చొరబడిన వ్యక్తి పోలీసులకు అప్పగింత



ఇంట్లోకి చొరబడిన వ్యక్తి

ఏలూరు క్రైం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన దొంగలు సంచరిస్తున్నారని అప్రమత్తంగా ఉండాలని ఇప్పటికే పోలీసులు ప్రజలను అలర్ట్ చేశారు. దీంతో నార్త్ ఇండియా వారు హిందీ మాట్లాడేవారు ఎవరైనా కనిపిస్తే ఒక్కసారి ఉలిక్కిపడుతున్నారు. ఏలూరు కట్టా సుబ్బారావు వీధిలో నివాసం ఉంటున్న మృత్యుంజయరావు ఇంట్లో ఇటీవల వివాహం జరిగింది. పెళ్లి అనంతరం కుటుంబ సభ్యులంతా ఊరు వెళ్ళగా యజమాని మృత్యుంజయరావు ఒక్కరే ఇంటి వద్ద ఉన్నారు.అయితే రాత్రి 8 గంటల ప్రాంతంలో ఒక వ్యక్తి వెనుక నుంచి ఇంట్లోకి ప్రవేశించి కర్రతో దాడికి ప్రయత్నించాడు. దీంతో ఆయన భయంతో పెద్ద పెద్ద కేకలు వేస్తూ ఇంటి చుట్టు తిరిగి తప్పించుకోగలిగారు. చివరకు ఒక క్రికెట్ బ్యాట్ కనిపించడంతో ఆ వ్యక్తి నుంచి కాపాడుకోవడానికి తలపై మోదాడు. ఈలోగా ఆయన అరుపులకు చుట్టు పక్కల వారు రావడంతో అజ్ఞాత వ్యక్తిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. తను హిందీ మాట్లాడడం, షర్టు లేకుండా ఉండడం ఆ వ్యక్తి ఎవరనేది అంతు పట్టని విషయంగా ఉంది. ఏలూరు టూటౌన్ పోలీసులు వచ్చి ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఆ వ్యక్తి ఎవరనేది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.







ప్లాంటేషన్‌లో అక్రమార్కులు కొట్టేసిన జామాయిల్ చెట్లు.. వదిలేసిన దుంగలు.. జామాయిల్ ప్లాంటేషన్ వివరాలు తెలిపే శిలాఫలకం

అడవిలో దొంగలు..

- అక్రమంగా జామాయిల్ నరికివేత
- గుట్టుగా సాగిపోతున్న విక్రయాలు
- కొరవడిన అటవీ శాఖ పర్యవేక్షణ

జీలుగుమిల్లి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎఫ్‌డీసీ(ఏపీ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్)లో గుర్తు తెలియని అటవీ దొంగలు అక్రమంగా జామాయిల్ చెట్లను నరికి విక్రయిస్తున్నారు. జీలుగుమిల్లి ఏపీఎఫ్‌డీసీ జామాయిల్ ప్లాంటేషన్ పరిధిలో చెట్లు నరికివేస్తున్నారు. వర్షాకాలం కావడంతో ప్లాంటేషన్‌లో తుప్పలు పెరిగాయి. దీంతో జామాయిల్ చెట్లను అక్రమార్కులు నరికిన ఆనవాళ్లు కనిపించడం లేదు. అదే వేసవిలో అయితే ఎక్కడ చెట్టును నరికినా ఇట్టే గుర్తించడానికి అవకాశం ఉంటుంది. వర్షాకాలాన్ని ఆసరాగా చేసుకుని కలపను మరింతగా తరలిస్తున్నారు. ఏపీఎఫ్‌డీసీ 2006లో జామాయిల్ ప్లాంటేషన్ జీలుగుమిల్లి పరిధిలో 56 హెక్టార్లలో నాటారు. అక్రమార్కుల నరికివేత కారణంగా ప్లాంటేషన్ ఇప్పటికే కొంత అంతరించిపోయింది. అక్కడక్కడ ఏపుగా పెరిగి కనిపించే చెట్లను ఇటీవల పొగాకు బ్యారన్ బాదులు కొందరు అమ్ముకుంటున్నారు. రైతు వారీగా కొంత మంది పొలాల్లో జామాయిల్ సాగు చేపట్టారు. వీటి నుంచి పర్మిషన్ తెచ్చుకుని అడవిలో నరికిన చెట్లను బయట తెచ్చి విక్రయిస్తున్నారు. రాత్రి సమయంలో నరికిన జామాయిల్ బాదులు కొందరు ట్రాక్టర్లపై బయటకు తరలిస్తున్నట్టు స్థానికులు చెబుతున్నారు. ప్లాంటేషన్ పర్యవేక్షణ నేపథ్యంలో అడవిలోకి కనీసం పశువుల కాపరులను సైతం రానివ్వడం లేదు. మేకలు, గొర్రెల కాపరులు ప్లాంటేషన్ లోపలికి వస్తే తమ అక్రమ కలప నరికివేత గుట్టు రట్టవుతుందని నిలువరిస్తున్నట్టు కొందరి వాదన. ఇలా కొందరు అక్రమ అటవీ కలపవ్యాపారానికి జామాయిల్ ప్లాంటేషన్ అడ్డాగా మారింది. ఒక్కో బాదు సుమారు రూ.1500 నుంచి రూ.1000మధ్య విక్రయిస్తున్నారు. రైతుల అవసరాన్ని బట్టి బాదుకు ధర వెచ్చించి కొనుగోలు చేస్తుంటారు. సంబంధిత అధికారులు జామాయిల్ కలప అక్రమ నరికివేతకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని సమీప గ్రామాల ప్రజలు చెబుతున్నారు. అటవీ శాఖాధికారులు తక్షణ చర్యలు చేపట్టి కలప అక్రమంగా తరలిపోకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.






నిందితులను మీడియాకు చూపుతున్న పోలీసులు.. స్వాధీనం చేసుకున్న బంగారపు నగలు

ఎస్.ఇల్లింద్రపర్రు చోరీ కేసును ఛేదించిన పోలీసులు

- అత్తాకోడళ్లను బంధించి చోరీ
- 40 కాసుల బంగారం స్వాధీనం

పెనుమంట్ర, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): సినీ ఫక్కీలో ఇంట్లోకి ప్రవేశించి అత్తాకోడళ్లను తాళ్లు, చీరతో కాళ్లు చేతులు బంధించి, చంపుతామని బెదిరించి చోరీకి పాల్పడిన ముఠా సభ్యులు ఎట్టకేలకు పోలీసుల వలకు చిక్కారు. పెనుగొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాయుడు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నిందితులను, దోపిడీ చేసిన బంగారు ఆభరణాలను స్వాధీనపరుచుకున్నారు. సీఐ రాయుడు తెలిపిన వివరాల ప్రకారం పెనుమంట్ర మండలం సోమరాజు ఇల్లింద్రపర్రులో ఈ నెల 16వ తేదీ రాత్రి 7:45 సమయంలో ఇంట్లోకి ప్రవేశించి, కత్తి చూపించి చంపేస్తామని బెదిరించి, నగదు, బంగారు నగలు దోచుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు అప్పట్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నర్సాపురం డీఎస్పీ శ్రీవేద ఆధ్వర్యంలో రెండు బృందాలు ఏర్పాటు చేసి గాలించి ముగ్గురు దొంగలను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 40.5 కాసుల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం పెనుమంట్ర మండలం పోలీస్ స్టేషన్ పరిధిలో నత్తా రామేశ్వరం ముఖద్వారం వద్ద నిందితులు వెలగల నరేంద్రరెడ్డి, తెరవాడ హనుమంతరావు, చింతల సుధాకర్ ఉన్నట్టు తెలుసుకుని బృందంతో వెళ్లి అరెస్ట్ చేశామన్నారు. సీఐతో పాటు ఆచంట ఎస్.ఐ. కె.వి.రమణ, పెనుమంట్ర ఎస్.ఐ. కె.స్వామి, ఏఎస్ఐ అంజిబాబు, నరసాపురం సైబర్ టీం సుబ్రహ్మణ్యం, జిల్లా సైబర్ టీం భాస్కరరావులు కేసు దర్యాప్తులో పాల్గొన్నారు.

ఇడా వైస్ ఛైర్మన్‌గా ఇన్‌చార్జి జేసీ విశ్వేశ్వరరావు



ఏలూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఇడా) వైస్ ఛైర్మన్‌గా ఇన్‌చార్జి జేసీగా ఉన్న జిల్లా రెవెన్యూ అధికారి వల్లూరు విశ్వేశ్వరరావును నియమిస్తూ పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేశ్ కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల జేసీ పి.ధాత్రిరెడ్డి రతన్ టాటా ఆర్‌టీహెచ్ సీఈవోగా బదిలీపై వెళ్లారు. ఈ నేపథ్యంలో ఇన్‌చార్జి జేసీగా ఉన్న విశ్వేశ్వరరావు ఇడా వైస్ ఛైర్మన్‌గా ఆమె స్థానంలోనే ఇప్పుడు పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించారు.

సెల్‌ఫోన్ మాట్లాడుతూ ఆర్టీసీ బస్సు డ్రైవింగ్

వారించిన ప్రయాణికులపై చిందులు

చివరకు విధుల నుంచి తొలగింపు



ఏలూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దని ప్రశ్నించిన ప్రయాణికులపై దురుసుగా ప్రవర్తించిన డ్రైవర్ వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ సృష్టించింది. ఏలూరు నుంచి జంగారెడ్డిగూడెం పల్లె వెలుగు బస్సును మంగళవారం డ్రైవర్ సాయికుమార్ సెల్ మాట్లాడుతూ నడిపాడు. ఇది గమనించిన ప్రయాణికులు ప్రమాదకరమని వారించగా తిరిగి వారిపై విరుచుకుపడ్డాడు. ఈ వీడియో వైరల్‌గా మారడంతో స్వయంగా చూసిన డీపీటీవో షేక్ షబ్నం ఆ డ్రైవర్‌ను విధుల నుంచి తప్పించినట్లు తాజాగా ప్రకటించారు.

విద్యార్థికి విద్యుదాఘాతం

దెందులూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): జీఎస్టీపై అవగాహన కార్యక్రమంలో మైక్‌తో మాట్లాడుతుండగా గోపన్నపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థి కార్తీక్‌కు మంగళవారం విద్యుత్ షాక్ తగిలింది. విషయం తెలుసుకున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ, డీవైఈవో రవీంద్ర భారతి ఏలూరు ఆశ్రం ఆస్పత్రికి వెళ్లి కార్తీక్‌ను పరామర్శించారు. బుధవారం ఎంఈవో ప్రసాద్‌తో కలిసి కరెంట్ షాక్‌పై విచారణ చేపట్టారు.

28 నుంచి హనుమాన్ దీక్ష మాలధారణ

తాడేపల్లిగూడెం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెంలోని ఎస్వీఆర్ సర్కిల్ వద్ద ఉన్న సువర్చల సుందర హనుమ ఆలయం ఆధ్వర్యంలో హనుమాన్ మాలధారణ కార్యక్రమం ఈనెల 28 నుంచి ప్రారంభిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు ఆకుల నరిసింహమూర్తి తెలిపారు. ఈనెల 28వ తేదీన 41 రోజుల దీక్ష, నవబంరు 17 నుంచి 21 రోజుల దీక్ష, నవంబరు 27 నుంచి 11 రోజుల దీక్ష మాలధారణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. డిసెంబరు 8వ తేదీన ఇరుముడులు అనంతరం గ్రామ సంచారం, పూర్ణాహుతి కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు హర్షితదుర్గ ఎంపిక

అత్తిలి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): లక్ష్మీనారాయణపురం ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఎం.హర్షితదుర్గ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం ఎంవీ సుబ్బరాజు తెలిపారు. ఉమ్మడి ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఏలూరులో నిర్వహించిన పోటీలలో ఆమె ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థిని దుర్గ, పీఈటీ సురేష్‌ను గ్రామ సర్పంచ్ పి.నాగేశ్వరరావు, ఎస్ఎంసీ ఛైర్మన్ అప్పలరాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రజలందరికీ సురక్షిత మంచినీరు అందిస్తాం


రోడ్డు పనులు ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామ

ఉండి, అక్టోబరు8 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అన్ని గ్రామాల ప్రజలకు సురక్షిత మంచి నీరు అందించడమే ధ్యేయమని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. బుధవారం పాములపర్రులో జల జీవన్ మిషన్ పథకంలో భాగంగా మైక్రోఫిల్టర్ వాటర్ పథకాన్ని, సీసీ రోడ్డు వంటి అభివృద్ధి పనులు ఆయన ప్రారంభించారు. సర్పంచ్ కేసన శాంతకుమారి బలుసులరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాములపర్రు నుంచి పెదకాపవరానికి వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్ నిర్మాణం త్వరితగతిన పూర్తిచేస్తామన్నారు. పాములపర్రు మంచినీటి చెరువులోకి నీరు అందించే పంటకాలువ పూడిక, కాలుష్యం బారిన పడడంతో దానిని అభివృద్ధి చేసి, మంచినీటి సమస్య తలెత్తకుండా చేస్తామన్నారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు తోట రాము, టీడీపీ మండల అధ్యక్షుడు కరిమెరక నాగరాజు, ఏఎంసీ వైస్ ఛైర్మన్ యడవల్లి వెంకటేశ్వరరావు, కేసన యాదగిరి, కళ్లేపల్లి సతీష్, వర్రే పసముద్రమూర్తి, గురుగుబిల్లి సత్యనారాయణ, కర్రి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పులుగుమ్మలో ఓహెచ్ఎస్ఆర్‌కు భూమిపూజ

ఉండి పంచాయతీ పరిధిలోని పులుగుమ్మలో ప్రజలకు పూర్తిగా మంచినీరు అందించడానికి ఆయా పనుల నిర్మాణానికి శిలాఫలకాన్ని డిప్యూటీ స్పీకర్ రఘురామ ఆవిష్కరించారు. సర్పంచ్ కమతం సౌజన్యబెనర్జి, గ్రామకార్యదర్శి అనిల్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సమైక్యంతోనే గ్రామాల అభివృద్ధి : ఎమ్మెల్యే బొలిశెట్టి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొలిశెట్టి

పెంటపాడు, అక్టోబరు 8 (ఆంధ్ర జ్యోతి) : అందరూ సమైక్యంతో ముందుకు వెళ్తేనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. బుధవారం పెంటపాడు ఎస్సీ కాలనీలో రూ.60 లక్షల అంచనాతో రూపొందించిన ఎస్సీ కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానికి గ్రామ సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే మాట్లాడారు. కమ్యూనిటీ భవనానికి రూ.60 లక్షలు అవుతుందని అంచనా వేశారని, వీటిలో సుమారు రూ.22 లక్షలు ప్రజా విరాళాలుగా సేకరించిన సర్పంచ్ సూర్యకళ, డాక్టర్ వంశీలను అభినందించారు. కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న , బండారు వెంకట్రావు, కొప్పూరి లక్ష్మణరెడ్డి, దాసరి శ్రీనివాస్, తాడేపల్లి ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ కాలేజీల్లో వసతులపై దృష్టి సారించాలి'



తిరుపతి సమావేశంలో పాల్గొన్న ఆరిమిల్లి రాధాకృష్ణ

తణుకు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ కాలేజీల్లో అధ్యాపకుల కొరతను అధిగమించడానికి, వసతుల కల్పనకు దృష్టి సారించాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. బుధవారం తిరుపతిలోని వేంకటేశ్వర యూనివర్సిటీలో 'పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సమావేశంలో ఉన్నత విద్యాపలితాల పనితీరు, ఆడిట్ అనే అంశంపై భారత ప్రభుత్వ చట్టం నివేదికపై జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడారు. వేంకటేశ్వర విశ్వవిద్యాలయం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉన్నత ప్రమాణాలు సాధించాలంటే పలు వర్సిటీలతో కలిసి సమన్వయం చేసుకోవాలన్నారు. కెరియర్ కౌన్సెలింగ్, ప్లేస్‌మెట్ అంశాలపై దృష్టి సారించాల్సిన ఆవశ్యకత ఉందని వివరించారు.

టీడీపీలో చేరిన వైసీపీ యువజన అధ్యక్షుడు 'జవ్వాది'


పార్టీ కడువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న తోట

భీమవరం టౌన్, అక్టోబరు 8 (ఆంధ్ర జ్యోతి) : భీమవరం మండల వైసీపీ యువజన విభాగ అధ్యక్షుడు జవ్వాది గణేశ్వర కుమార్ తన అనుచరులు 300 మందితో కలిసి టీడీపీలో బుధవారం చేరారు. ఆయనకు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి తోట సీతారామలక్ష్మి పార్టీ కండువా కప్పి స్వాగతం పలికారు. తొలుత గుట్లపాడు గ్రామం నుంచి భారీ బైక్ ర్యాలీ నిర్వహించి భీమవరం మండల టీడీపీ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువ నాయకుడు జవ్వాది గణేష్, వారి అనుచరులు రానున్న స్థానిక సంస్థల అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు. ముఖ్య అతిథిగా ఏపీఐఐసీ ఛైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు, పార్టీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడారు. భీమవరం మండల టీడీపీ అధ్యక్ష కార్యదర్శులు కొయ్యలగడ్డ గణపతి, కోళ్ల సీతారాం, ఏఎంసీ ఛైర్మన్ కలిదిండి సుజాత రామచంద్రరాజు, నాగిడి తాతాజీ, ఉప్పులూరి చంద్రశేఖర్, కోళ్ల నాగబాబు, తదితరులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మకు మాజీ మంత్రి రోజా, ఎమ్మెల్సీల పూజలు

భీమవరంటౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి):మావుళ్లమ్మ అమ్మవారిని మాజీ మంత్రి ఆర్‌కే రోజా, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, విశాఖపట్నంకు చెందిన ఎమ్మెల్సీ వరుదు కల్యాణి దర్శించుకున్నారు ఆలయానికి వచ్చిన వారి కుటుంబ సభ్యుల పేరిట ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆశీర్వచనాలు అందించారు. దేవస్థానం తరపున వారికి శేషవస్త్రాలను, ప్రసాదాలను సహాయ కమిషనర్ బుద్దా మహాలక్ష్మి నగేష్ అందించారు.

'కళామ తల్లి ముద్దుబిడ్డ అడవి బాపిరాజు'

భీమవరంటౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కళామతల్లి ముద్దుబిడ్డ, బహుముఖ ప్రజ్ఞానిధి అడవి బాపిరాజు అని రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణ అన్నారు. భీమవరం వాసి అడవి బాపిరాజు జయంతి కార్యక్రమాన్ని అరసవల్లి ఈశ్వరమ్మ వీర వెంకట ఆచారి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాపిరాజు వ్యక్తి కాదు.. మహాశక్తి అన్నారు. ట్రస్టు అధ్యక్షుడు అరసవల్లి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తిక్కన, సముద్రగుప్తుడు వంటి చిత్రాలు గీశారని సినీ రంగప్రవేశం చేసి అనసూయ, ధ్రువ విజయం, మీరాబాయి వంటి సినిమాలకు కళాదర్శకత్వం చేశారన్నారు. రచయిత కలిగొట్ల గోపాలశర్మ, జవ్వాది శ్రీనివాస్, చెరుకువాడ రంగసాయి మాట్లాడారు. ఎస్‌కే చాన్ బాషా, ద్వారపురెడ్డి త్రివిక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలో చేరారనేది అవాస్తవం : టీడీపీ నాయకులు

అత్తిలి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఉరదాళ్లపాలెంలో 50 కుటుంబాల వారు కూటమి పార్టీ నుంచి వైసీపీలో చేరారని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ప్రకటించడాన్ని ఆ గ్రామ తెలుగుదేశం నాయకులు ఖండించారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ దాసం బాబ్జీ మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికలలో వైసీపీకి ప్రచారం చేసిన వారినే పార్టీలో చేరినట్లుగా ప్రకటించారని అన్నారు. సర్పంచ్ కాసుల వెంకటసత్యనారాయణ మాట్లాడుతూ మాజీ మంత్రి కారుమూరి గ్రామానికి చేసినది ఏమి లేదని అన్నారు. నీటి పంపిణీ కమిటీ ఉపాధ్యక్షుడు కుసంపూడి శ్రీనివాస్ మాట్లాడుతూ వైసీపీ నాయకులు అసత్య ప్రచారాన్ని మానుకోవాలన్నారు. డీకే వల్లి, సొసైటీ అధ్యక్షుడు దాసం వెంకటేశ్వరరావు, బొర్రా వెంకట్రామయ్య, బొబ్బిలి మోహనరావు, లక్ష్మణరావు, బొబ్బిలి తేజ, కొత్తపల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


భీమవరంలో ర్యాలీలో పాల్గొన్న జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ కేదారేశ్వరరావు


నరసాపురం పట్టణంలో జీఎస్టీపై ప్రచారం నిర్వహిస్తున్న పొత్తూరి రామరాజు, టీడీపీ శ్రేణులు


తాడేపల్లిగూడెంలో విజేతలకు బహుమతులు అందిస్తున్న అధికారులు

జీఎస్టీ తగ్గింపుతో అన్నివర్గాల ప్రజలకు ఊరట

» జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ కేదారేశ్వరరావు » 'సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్'పై అవగాహన ర్యాలీ

భీమవరంటౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో అన్ని వర్గాల ప్రజలకు ఊరట లభిస్తుందని, తద్వారా ప్రజల ఆదాయం పెరుగుతుందని అసిస్టెంట్ కమిషనర్ వి.కేదారేశ్వరరావు అన్నారు. బుధవారం శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో భీమవరం ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్' పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత నెల 22 నుంచే కొత్త జీఎస్టీ అమల్లోకి వచ్చిందని, ఈమేరకు నిత్యావసర వస్తువులు మరింత చౌకగా మారాయన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీకేజే ప్రసూన మాట్లాడారు. కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, యూజీసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.అరవింద స్వామి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ కె.శ్రీనివాసరావు, అధ్యాపకులు సత్యనారాయణ, నరసింహమూర్తి పాల్గొన్నారు.

● నరసాపురం టౌన్ : జీఎస్టీ తగ్గడంతో అన్ని వస్తువుల ధరలు తగ్గి ప్రజల ఆదాయం పెరగనుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు అన్నారు. బుధవారం పట్టణంలోని పంజా సెంటర్‌లో దుకాణాల్లోకి వెళ్లి రేట్లు తగ్గిన వస్తువుల వివరాలను ఆరా తీశారు. వాటిని అక్కడున్న వినియోగదారులకు సూచిం చి, రానున్న రోజుల్లో అన్ని వస్తువులు ధరలు ఇంకా తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, పొన్నాల నాగబాబు, అందే రామకృష్ణ, బేగం, హుసేన్, మౌలాలీ, ఇమ్రాన్, గౌస్, కోరాడ పాపారావు పాల్గొన్నారు.

● తణుకు:ఎస్కేఎస్ఎం డిగ్రీ కాలేజీలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఉప కమిషనర్ సత్య పద్మావతి మాట్లాడుతూ ప్రస్తుతం వస్తున్న జీఎస్టీ నూతన సాంకేతిక ఆధారిత వ్యవస్థగా, పన్ను చెల్లింపులు, సులభతరం చేయడం, పారదర్శకత పెంచడం లక్ష్యంగా ఉందన్నారు. అనంతరం విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ప్రిన్సిపాల్ సీహెచ్ ఏడుకొండలుతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● గణపవరం : జీఎస్టీ తగ్గింపుతో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని ఎంపీడీవో బేబి శ్రీలక్ష్మి అన్నారు. బుధవారం గణపవరం మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయిలో జరిగిన జీఎస్టీ అమలుపై జరిగిన అవగాహన సదస్సులో గ్రామ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. జీఎస్టీ 2.0 అన్ని వర్గాలకే కాకుండా ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుందన్నారు. గ్రామ కార్యదర్శులు శివరామ్‌ప్రసాద్, డి. రామాంజనేయులు పాల్గొన్నారు.

●తాడేపల్లిగూడెం రూరల్ :జీఎస్టీ తగ్గింపుపై ప్రతీ ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఎంపీడీవో వి.చంద్రశేఖర్ సూచించారు. మాధ వరంలోని జడ్పీ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలల్లో జీఎస్టీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు జీఎస్టీపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. సర్పంచ్ ముప్పిడి సూర్యకుమారి, డిప్యూటీ ఎంపీడీవో ముప్పిడి వెంకటేష్, కార్యదర్శి బి.ఫణికుమార్ పాల్గొన్నారు.


ఆర్థిక సాయం అందిస్తున్న హరిరామజోగయ్య, మానవతా సభ్యులు

కాలు కోల్పోయిన వ్యక్తికి 'మానవతా' సాయం

పాలకొల్లు టౌన్, అక్టోబరు8(ఆంధ్రజ్యోతి): కార్పెంటర్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్న పాలకొల్లు పట్టణంలోని మారుతీ థియేటర్ సమీపంలోని సుబ్రహ్మణ్య అనే వ్యక్తి కుడికాలికి ఇన్‌ఫెక్షన్ సోకి ప్రమాదవశాత్తు కాలు తీసివేశారు. పేదరికంలో ఉన్న అతడు పనికి వెళ్లలేక పోతున్న విషయం తెలుసుకున్న మానవతా సేవాసంస్థ పాలకొల్లు మండల శాఖ స్పందించి అతడికి ఆర్థికసాయం చేశారు. సంస్థ పాలకొల్లు మండల శాఖ సమకూర్చిన రూ.12వేల ఆర్థికసాయాన్ని మాజీ ఎంపీ చేగొండి హరిరామజోగయ్య చేతుల మీదుగా అతడికి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా హరిరామజోగయ్య మాట్లాడుతూ మానవతా సంస్థ పాలకొల్లు మండల శాఖ చేపడుతున్న సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమైనవన్నారు. ఆర్థికసాయం అందించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ముత్యాల రామారావు, చిలుకూరి ద్రాక్షారామ భీమన్న, ముత్యాల శ్రీనివాస్, సురేష్, శ్రీవాస్తవ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

ఫెన్సింగ్ పోటీలకు తూర్పువిప్పర్రు విద్యార్థులు

ఇరగవరం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన క్రీడా పోటీల్లో తూర్పువిప్పర్రు ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలు ఎంపికైనట్లు హెచ్ఎం పి.ఉషశ్రీ తెలిపారు. వీరవాసరం ఉన్నత పాఠశాలలో జరిగిన ఫెన్సింగ్ పోటీల్లో 12 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్-14 విభాగంలో ఎస్.రోహిత్, టి.లావణ్య, ఎస్.మల్లీశ్వరి, ఎం.డాలి, ఎం.డాని, ఎస్.లోకేష్, ఎ.పాపానాయుడు, పి.వీరవేణి, అండర్-17 విభాగంలో ఈ.అనూష, ఆర్.శ్రీదివ్య, బి.సుధ, కె.ఉమా ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయులు వి.సుమలత, ఎ.శ్రీనివాసులను సర్పంచ్ తమ్మిశెట్టి సత్యనారాయణ, గ్రామ పెద్దలు, అభినందించారు.

'రాయలం మహాలక్ష్మి మాదిరిగా పనిచేయాలి'

భీమవరం రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి అంగన్‌వాడీ సెంటర్‌లలో రాయలం మహాలక్ష్మి మాదిరిగా అందరూ మెచ్చేలా అన్ని సెంటర్ల టీచర్లు పని చేయాలని భీమవరం ఐసీడీఎస్ పీడీ డి.శ్రీలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక గాయత్రి హాస్పిటల్‌లో 'టీచర్లకు తల్లిపాలు, నెలలు నిండకుండా పుట్టిన బిడ్డలు ఏ విధంగా ఉంటారు' అనే అంశంపై అవగాహన కల్పించేందుకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో లక్ష్మీకాంతం మాట్లాడుతూ రెండు రోజుల క్రితం భీమవరంలో ఇచ్చిన అవార్డులలో ఐదుగురు టీచర్లకు స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు అందజేయాలన్నారు. ప్రాజెక్ట్ లీడర్ రాయలం ఐదు అంగన్‌వాడీ సెంటర్ సీహెచ్. మహాలక్ష్మికి స్వచ్ఛ ఆంధ్ర బెస్ట్ అవార్డు రావడంపై ఆమెను సీడీపీవో టీచర్లు పూలబొకే అందించి శాలువాతో ఘనంగా సత్కరించారు. సూపర్‌వైజర్స్ డి.అనిల్‌కుమారి, టీటీవీఎస్ సరోజిని, సాహిదా ఖాన్, గీత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి : ఏఐటీయూసీ

తాడేపల్లిగూడెం,అక్టోబరు8(ఆంధ్రజ్యోతి):పంచాయతీల్లో అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఏఐటీయూసీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం తాడేపల్లిగూడెంలో అవుట్ సోర్సింగ్, కార్మికులు నిరసన తెలిపి, ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో కార్యాలయం సూపరిటెండెంట్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఏఐటీయూసీ నాయకులు టీవీ రాజు, ఎం.హరీష్, కళింగ లక్ష్మణరావు, రాష్ట్ర కోశాధికారి తాడికొండ వాసు, పాల్గొన్నారు.

'ఎస్సీ, ఎస్టీల హక్కుల కోసం పాటుపడాలి'

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీల హక్కుల కోసం పాటుపడాలని విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యునిగా పదవి పొందిన కొల్లి రాజశేఖర్‌ను పలువురు కోరారు. తాడేపల్లిగూడెం మండలం బంగారుగూడెంలో పోలిపో అరుణ్ ఆధ్వర్యంలో బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు సమయమంతుల కాశీని సన్మానించారు. బీజేపీ నాయకులు నల్లూరి శ్రీనివాస్, కొడవటి రాజేష్, ఎంఆర్‌పీఎస్ నాయకులు కండెల్లి రాజేష్, దూలపల్లి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



భీమవరంలో అంబేద్కర్ విగ్రహం వద్ద న్యాయవాదులు, వామపక్ష నాయకుల ఆందోళన

సీజేఐపై దాడి అమానుషం

» న్యాయవాదులు, వామపక్ష నాయకుల ఆందోళనలు

భీమవరం క్రైం/భీమవరం టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి):జస్టిస్ బీఆర్ గవాయ్‌పై సుప్రీంకోర్టులో జరిగిన దాడి అమానుషమని, ఈ దాడిని నిరశిస్తూ ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్), బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. బుధవారం భీమవరం రెండో పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కాంస్య విగ్రహం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ సీజేఐపై జరిగిన దాడి సభ్యసమాజాన్ని సిగ్గుతో తలదించుకునేలా చేసిందని, దీనిపై కఠినంగా వ్యవహరించపోతే ఇటువంటి దాడులు పునరావృతమయ్యే అవకాశం ఉందన్నారు. తొలుత కోర్టు భవనం నుంచి ర్యాలీగా బయలుదేరి అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. బార్ అధ్యక్షుడు ఏలేటి యోహాన్, ఐఏఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెల్లబోయిన రంగారావు, మల్లుల శ్రీనివాసరావు, మోగంటి శివ, గుంటి ప్రభు, పీటర్ తదితరులు పాల్గొన్నారు.

● సీజేఐపై దాడికి పాల్పడిన న్యాయవాది రాకేశ్ కిషోర్‌ను చట్టబద్ధంగా శిక్షించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. బుధవారం భీమవరం పాత బస్టాండ్ రోడ్‌లో డాక్టర్ అంబేద్కర్ కాంస్య విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి, నిరసన తెలిపారు. సీపీఐ, సీపీఎం, ఫార్వర్డుబ్లాక్, ఎంసీపీఐయూ, ప్రజా సంఘాలు ఆందోళనలో పాల్గొన్నాయి. సీపీఎం జిల్లా కార్యదర్శి జె.ఎన్.వి.గోపాలన్, ఎంసీపీఐయూ జిల్లా నాయకులు కె.మహంకాళి, ఫార్వర్డ్ బ్లాక్ డివిజన్ కార్యదర్శి దండు శ్రీనివాసరాజు మాట్లాడారు. చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాం టప్రసాద్, మల్లుల శ్రీనివాసరావు, వై.వి. ఆనంద్, నాయకులు నాగిడి శాంతమూర్తి, చాన్ బాషా, సీపీఎం నాయకులు బి.వాసుదేవరావు, ఎం.వైకుంఠరావు, డి.త్రిమూర్తులు పాల్గొన్నారు.

● గణపవరం : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్.గవాయ్‌పై దాడికి ప్రయత్నించిన వారిని దేశద్రోహులుగా ప్రకటించాలని కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి చిన్నం చిననాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం వరదరాజపురం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. జస్టిస్ గవాయ్‌పై బూటుతో దాడికి ప్రయత్నించడం ప్రజాస్వామ్యంపై దాడిగా పరిగణించాలన్నారు. సర్పంచ్ గుర్రం సుబ్బారావు, కేవీపీ నాయకులు ప్రసాద్, రాజు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

'అనధికారికంగా బాణసంచా విక్రయిస్తే చర్యలు'


బాణసంచా గోడౌన్‌కు తాళం వేయిస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ

అత్తిలి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలో అనధికారికంగా బాణాసంచా తయారు చేసినా, విక్రయాలు చేసినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అత్తిలి తహసీల్దార్ దశిక వంశీ తెలిపారు. మండలంలో ఎక్కడైనా ఈ విధంగా బాణసంచా తయారీ, విక్రయాలు చేస్తుంటే పోలీసు, రెవెన్యూ, అగ్నిమాపక శాఖ వారికి తెలియజేయాలన్నారు. అత్తిలిలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాన్ని మూడు శాఖలకు చెందిన అధికారులు తనిఖీ చేసినట్లు తెలిపారు. ఎస్ఐ పి.ప్రేమరాజు, అగ్నిమాపక దళాధికారి కె.గంగరాజు పాల్గొన్నారు.

బాణసంచా గోడౌన్ల తనిఖీ

నరసాపురం రూరల్ : పట్టణ, మండలంలోని బాణసంచా గోడౌన్లను బుధవారం తహసీల్దార్ ఐవీవీ సత్యనారాయణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా అధికారుల ఆదేశాలతో బాణసంచా లైసెన్స్‌దారుల వద్దకు వెళ్లి రెన్యువల్ నిల్వ సరుకులపై ఆరా తీశారు. మండలంలోని లక్ష్మణేశ్వరంలో బాణసంచా తయారీదారుల వద్దకు వెళ్లి స్టాక్‌ను పరిశీలించారు. ప్రమాదాలు జరుగుతున్నందున తదుపరి ఆదేశాలు వచ్చే వరకు గోడౌన్‌ను మూసివేయాలని ఆదేశించడంతో తాళం వేశారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భారీ వర్షం

» రహదారులు జలమయం


ఆకివీడులో వర్షంలో వెళుతున్న విద్యార్థిని

కాళ్ల/యలమంచిలి/ఆకివీడు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : కాళ్ల మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం కురిసిన భారీ వర్షానికి జనజీవనం స్తంభించింది. రహదారులన్నీ జలమయమయ్యాయి. ఉదయం నుంచి తీవ్ర ఎండ కాచి సాయంత్రం సమయంలో ఒక్కసారిగా ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. కాళ్ల గ్రామంలో సినిమా హాల్ సెంటర్ శివాలయం వద్ద రహదారి చెరువులను తలపించే విధంగా వర్షపు నీరు నిలిచాయి. ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. యలమంచిలి మండలంలో రహదారులు, పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. జనజీవనం స్తంభించింది. ప్రధాన రహదారుల్లోని గుంతల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆకివీడులో బుధవారం మధ్యాహ్నం వరకు ఎండ కాసింది, ఒక్కసారిగా వాతావరణంలో మార్పుతో భారీ వర్షం కురిసింది. డ్రెయినేజీలు పూడుకుపోయి పారుదల క్షీణించడంతో రహదారులపై నీరు నిలిచింది. వాహనదారులు, పాదచారులు ఇక్కట్లు పడ్డారు. సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించాలని జనం కోరుతున్నారు.

విస్సాకోడేరులో 'సుపోషిత్ భారత్ - సక్షం భారత్'

పాలకోడేరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : సుపోషిత్ భారత్ - సక్షం భారత్‌లో భాగంగా బుధవారం విస్సాకోడేరు గ్రామ పంచాయతీ వద్ద సర్పంచ్ బొల్లా శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ సిబ్బందిచే కార్యక్రమం నిర్వహించారు. ఆకివీడు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో వాణీ విజయరత్నం మాట్లాడుతూ పుట్టిన గంటలోపే బిడ్డకు ముర్రిపాలు ఇవ్వాలని, తద్వారా బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరగడమే కాకుండా పౌష్టికాహారం అందించినట్లు అవుతుందన్నారు. టీడీపీ గ్రామ నాయకులు అప్పారావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పార్వతి, సూర్యకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆకివీడుకు ఆర్టీసీ బస్సుల ఆలస్యం తగదు : వెంకట్రావు

ఆకివీడు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులు ఆకివీడు బస్టాండుకు ఆలస్యంగా వస్తుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఏఎంసీ ఛైర్మన్ బొల్లా వెంకట్రావు ఆగ్రహించారు. రాజమహేంద్రవరం నుంచి ఆకివీడు వచ్చి వెళ్లే బస్సు సమయానికి రాకుండా రెండు,మూడు గంటలు ఆలస్యంగా వస్తుండడంతో ప్రయాణికులు తిరిగి వెళ్లిపోవడం కాని, ఆటోలకు వెళ్లిపోవడం జరుగుతుందన్నారు. ఆకివీడులో నైట్ హాల్ట్ ఉండడంతో ఉదయం 5.30 గంటలకు గంటలకు వెళుతుంది. ఉదయం 7.30గంటలకు, సాయంత్రం 4.00కు రావాల్సిన బస్సులు చాలా ఆలస్యంగా వస్తున్నాయి. ఏలూరు నుంచి నరసాపురం వెళ్లాల్సిన బస్సులు ఆలస్యంగా వస్తుండడంతో ప్రయాణికుల సహనం కోల్పోతున్నారన్నారు. సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీ ఉన్నతాధికారులను కోరుతున్నామన్నారు.

రేపు బహిరంగ వేలం

ఆకివీడు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): అగ్నిమాపకశాఖకు సంబంధించిన పాత వస్తువులు శుక్రవారం ఉదయం బహిరంగ వేలం వేస్తామని అధికారి జి.వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు. ఆసక్తి ఉన్నవారు వచ్చి పాడుకోవాలన్నారు.

విద్యాసామగ్రి వితరణ

మొగల్తూరు, అక్టోబరు8(ఆంధ్రజ్యోతి): పేరుపాలెం నార్త్ గ్రామంలోని అంగజాని వానిపాలెం ప్రాథమిక పాఠశాలకు దాత కుర్చీలు, విద్యా ఉపకరణాలు అందించారు. గ్రామానికి చెందిన చవాకుల పాండురంగారావు మనుమడు ప్రణయ్ జన్మదినం సందర్భంగా పాఠశాల విద్యార్థులు కూర్చునేందుకు అవసరమైన కుర్చీలు, ఇతర సామగ్రి అందించారు. హెచ్ఎం యు.కృష్ణవేణి, యూనియన్ బ్యాంకు మేనేజర్ రాజశేఖర్, ఎస్ఎంసీ ఛైర్మన్ నల్లి దేశాలమ్మ, చవాకుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భవిత పాఠశాలకు కంచాలు అందజేత

భీమవరంటౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మానవతా సేవ ద్వారా సమాజాలను బలోపేతం చేయవచ్చని లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు లయన్ వబిలిశెట్టి కనకరాజు, లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు బొండా రాంబాబు, అల్లు తులసీప్రసాద్, క్లబ్ కోశాధికారి కనగర్ల విజయరామకృష్ణ అన్నారు. భీమవరం కిషోర్ థియేటర్ రోడ్డులోని భవిత స్కూల్లో బుధవారం ఇంటర్నేషనల్ లయిన్స్ డే, వబిలిశెట్టి కనకరాజు పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. స్కూల్‌కు స్టీల్ కంచాలు, గ్లాసులు, బిస్కెట్స్ చాక్లెట్స్ పండ్లు పంపిణీ చేశారు.

ముగిసిన శిక్షణ తరగతులు

నరసాపురంరూరల్, అక్టోబరు8(ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజులుగా సర్పంచ్‌లకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. చివరి రోజున గ్రామ అభివృద్ధి, పాలన, నిర్వహణ, మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ్యం, ఖర్చులు, స్వచ్ఛభారత్ తదితర అంశాలపై ఎంపీడీవో వీరభద్రరావు శిక్షణ కల్పించారు. ఎంపీపీ సోని, ఈవోపీఆర్డీ నాగేంద్రకుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఘనంగా అన్నసమారాధన

మొగల్తూరు, అక్టోబరు(ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి వేడుకలు ముగింపు సందర్భంగా బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో అన్నసమారాధనలు నిర్వహించారు. మొగల్తూరు పంచాయతీ పరిధి కుక్కలవారి తోటలో అమ్మవారి పందిర వద్ద ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో వేలాదిగా భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.